ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శనివారం 2 నవంబరు 2024 | 3







సామర్లకోట భీమేశ్వరాలయంలో..



4లో..

అంబాజీపేటలో ప్రత్యేక అలంకరణలో వ్యాఘ్రేశ్వరుడు

ద్రాక్షారామ భీమేశ్వరాలయం




రాజమహేంద్రవరంలో గోదావరి ఘాట్

ఆధ్యాత్మిక.. ఆనందం

ఆరనీకుమా ఈ దీపం.. కార్తీక దీపం.. చేర నీ పాద దీపం కర్పూర దీపం.. కార్తీక మాసం అంటే అంత ప్రత్యేకత మరి.. కార్తీక మాసంలో చేసే స్నాన, జప, తప, దాన, వ్రతాలకు అనంతమైన పుణ్యఫలితాలు వస్తాయని కార్తీక పురాణం చెబుతోంది.. అందుకే ఏడాదంతా ఎలా ఉన్నా.. ఆ శివయ్యను ప్రసన్నం చేసుకునేందుకు ఈ నెలంతా ఆధ్యాత్మికత ఆనందకరమైన వాతావరణమే.. కార్తీక మాసం వచ్చిందంటే ఆ సందడే వేరు.. ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగి తేలాల్సిందే.. ఆ శివయ్యను కనులారా చూడాల్సిందే.. దీనికి ఎక్కడికో వెళ్లాల్సిన పనిలేదు.. మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కడా లేనన్ని ప్రధాన శైవ క్షేత్రాలు ఉన్నాయి.. ఒక పక్క పంచారామ క్షేత్రాలు.. సామర్లకోట కుమారరామం.. ద్రాక్షారామ భీమేశ్వరుడు.. మరోపక్క పాదగయ.. ఇంకో పక్క ఏకాదశ రుద్రులు ఇలా చెప్పుకుంటూ పోతే.. ఎన్నెన్నో ప్రముఖ ఆలయాలు ఉన్నాయి.. కార్తీకం అంటే హరిహరులకు ఎంతో ప్రీతికరం.. ఈ మాసంలో అన్నవరంలో చేసే గిరి ప్రదక్షిణ ప్రత్యేకమే.. కార్తీక దీపాలు వదిలేందుకు వచ్చే భక్తులతో గోదావరి ఘాట్లు కళకళలాడతాయి. హరోం..హర.. హరహర మహాదేవ శంభో శంకర.. నినాదాలతో మారుమ్రోగుతాయి.. ఈ క్షేత్రాలన్నీ చూడగలమా అంటారా.. ఎందుకు చూడలేరు.. ఆర్టీసీ నుంచి ప్రత్యేక దర్శనయాత్రలు ఉన్నాయి.. ఇక్కడి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని శైవక్షేత్రాలకు బస్సులు ఏర్పాటు చేశారు.. ఇంతేనా అంటే.. ఇక కుటుంబీకులతో సరదాగా గడిపే వన భోజనాలకు ఈ మాసమే అనుకూలం.. అందుకే ఈ నెలంతా ఆధ్యాత్మికం.. ఆనందం..

నెలంతా.. ఆకాశదీపం



అన్నవరంలో..

అన్నవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాస ప్రారంభసూచికగా శుక్రవారం రాత్రి పాడ్యమి తిథి తగలడంతో సత్యదేవుడి సన్నిధిలో ఆకాశదీపం ఏర్పాటు చేశారు. అనివేటి మండపంలో ప్రత్యేక పూజలు చేసి నలుదిక్కులా దర్శించేలా నాలుగు దీపాలను ఏర్పాటు చేసి ప్రత్యేక తాళ్లతో ధ్వజస్తంభం పైభాగంలో ఏర్పాటుచేశారు. అదే విధంగా సామర్లకోట కుమారరామంలో కూడా ఆకాశదీపం ఏర్పాటు చేశారు. కార్తీక మాసం నెలరోజులూ ఈ ఆకాశదీపం వెలుగుతూ ఉంటుంది. భక్తులు ఆకాశదీపం దర్శించుకుంటే జీవితంలో చీకట్లు తొలగి ఆయురారోగ్యాలతో ఉంటారని పండితులు పేర్కొన్నారు.



నేటి నుంచి రోడ్లకు రిపేర్లు

1332 కి.మీ..రూ.11.92 కోట్లు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి) గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రోడ్లు ధ్వంసమైన సంగతి తెలిసిందే.కనీసం గోతులకు మరమ్మతులు చేయలేదు. కూటమి ప్రభుత్వం మొదటగా మరమ్మతులపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా జిల్లావ్యాప్తంగా రోడ్లలో మొదట శనివారం నుంచి గోతులు పూడ్చి వేస్తారు. జనవరి 15వ తేదీ లోపు మొత్తం పనులు పూర్తి కావాలి. తర్వాత కొత్తరోడ్ల నిర్మాణం చేపడతారు.జిల్లాలో 1338.743 కిలోమీటర్ల మేర గుంతలు పూడ్చడానికి టెండర్లు పిలిచామని 1,95,989 పనులకు రూ.1192 లక్షలు మంజూ రయ్యాయని జిల్లా ఆర్అండ్‌బీ ఈఈ ఎస్‌బీవీ.రెడ్డి తెలిపారు. రాజమహేంద్రవరం అర్బన్‌లో 28.298 కిలోమీటర్లలో ఒక కిలోమీటరుకు రూ.5లక్షలు, రూరల్‌లో 201.426 కిలోమీటర్లకు సంబంధించి 43.730 కి.మీలకు రూ.272 లక్షలు మంజూరయ్యా యన్నారు. రాజానగరంలో 324.760 పనులు గుర్తించగా 71 పనులకు రూ.337 లక్షలు, అనపర్తిలో 214.123 పనులు గుర్తించగా 15,340 కిలోమీటర్లకు 198 లక్షలు, గోకవరం మండలంలో 64.482 పనులకు గుర్తించగా 14 పనులకు 85లక్షలు మంజూరయ్యాయన్నారు. రాజమహేం ద్రవరం డివిజన్‌లో మొత్తం 833.093 కిలోమీటర్ల మేర టెండర్లు పిలవగా ఇప్పటికే 145.070 కిలోమీటర్లకు 897 లక్షలు మంజూరైనట్టు చెప్పారు.కొవ్వూరులో 194.816 కిలోమీటర్లకు టెండర్లు పిలవగా 6.121 కిలోమీటర్లకు 42 లక్షలు, నిడదవోలులో 155.765 కిలోమీటర్లలోని 15,598 కిలోమీటర్లకు రూ.79 లక్షలు, గోపాలపురంలో 155.069 కిలోమీటర్లకు 29.200 కిలోమీటర్లకు 174 లక్షలు మంజూరయ్యాయన్నారు. మొత్తం కొవ్వూరు డివిజన్లకు 505.650 కిలోమీటర్లకు టెండర్లు పిలవగా 50.919 కిలోమీటర్లకు రూ.295లక్షలు మంజూరయ్యాయన్నారు. శనివారం అన్ని నియోజకవర్గాల్లో పనులు ప్రారంభిస్తారు

వచ్చే వరకూ.. డౌటే!



అత్యవసరమైనా..ఆలస్యమే

ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో బుధవారం పిడుగుపడి బాణసంచా తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం సంభవించిన ఘటన విధితమే.. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా మరో ఐదుగురు తీవ్రగాయాల పాలయ్యారు..స్థానికులు స్పందించి వెంటనే 108 కు ఫోన్ చేశారు.. అయితే 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న తణుకు నుంచి 108 రావడానికి గంటన్నర పట్టింది. దీంతో అప్పటి వరకూ క్షతగాత్రులు ఆపసోపాలు పడుతూనే ఉన్నారు.. ఈ ఒక్క సంఘటన చాలు 108లు ఎంత అత్యవసరంగా పనిచేస్తున్నాయో చెప్పడానికి..

- పనిచేయని కుయ్ కుయ్‌లు
- సమయానికి రాని 108లు
- మరమ్మతులే కారణం
- అస్తవ్యస్తంగా అత్యవసర సేవలు
- చివరి నిమిషంలో అవస్థ
- కూటమి ప్రభుత్వంపై ఆశలు

అనపర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అత్యవసరంగా సేవలందించేది 108.. అటువంటి వాహనాలు ఎలా ఉండాలి.. కుయ్.. కుయ్ అంటూ..రయ్..రయ్‌న పరుగులు పెట్టాలి.. అయితే ప్రస్తుతం ఉన్న వాహనాలు ఎలా ఉన్నాయో తెలుసా..ఆగితే స్టార్ట్ కావు.. స్టార్ట్ అయితే ఆగవు అనేలా ఉన్నాయి.ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను కాపాడే వాహనాలు నేడు ప్రాణ సంకటంగా మారాయి.కాలం చెల్లిన వాహనాల కారణంగా అటు సిబ్బంది, ఇటు క్షతగాత్రులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.ప్రమాదంలో గాయపడిన వారు సమయానికి 108లు రాక ప్రాణాలు కోల్పోతున్నారు.108 వాహనాలకు రూపకల్పన చేసి రెండు దశాబ్దాలవుతున్నా నిర్వ హణ గాలికొదిలేయడంతో ఇబ్బందులు తప్పడంలేదు.

2005 నుంచి ప్రారంభం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి సత్యం కంప్యూటర్స్ భాగస్వామ్యంతో 2005 ఆగస్టు 15న 108 వాహనాలు రూపొందించి సేవలు ప్రారంభించారు. ఆపద సమయంలో ఉన్న వ్యక్తికి తక్షణ వైద్యం అందించాలన్న సంకల్పంతో ఈ ఉచిత సర్వీసులను తెచ్చారు. తొలుత ఎనిమిది వాహనాలను వైఎస్ఆర్ ప్రారంభించారు. మూడు నెలల వ్యవధిలోనే వీటి సంఖ్య 35కు చేరుకుని విశేష సేవలందించడం ప్రారంభించాయి. 2007వ సంవత్సరం వచ్చేసరికి వీటి సంఖ్య 375కు చేరింది. జిల్లాకు పది వాహనాల చొప్పున అందుబాటులోకి తెచ్చారు. ప్రధాన నగరాల్లో జనాభాకు తగినట్టుగా వాహనాలను కేటాయించడంతో 108 సేవలు ఊపందుకున్నాయి. అదే సమయంలో మూడు మండలాలకు ఒక వాహనం చొప్పున కేటా యించి సేవలందించేవారు. 2014లో రాష్ట్ర విభజన జరిగే నాటికి ఉమ్మడి రాష్ట్రంలో 820 వాహనాలు ఉండగా వీటిలో 445 వాహనాలను ఏపీకి కేటాయించారు. అప్పటి నుంచి ఏపీలో టీవీజీ సంస్థ భాగస్వామ్యంతో సేవలందించారు.అయితే 2019 వచ్చే సరికి వీటి సంఖ్య 627కి పెరిగింది. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మండలానికి ఒక వాహనం ఉండాలని 104, 108 వాహనాలను వెయ్యి వరకు పెంచారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 814 వాహనాలు అరబిందో ఫౌండేషన్ సంస్థ ద్వారా సేవల్లో ఉండగా వీటిలో 25 శాతం వాహనాలు మూలన పడ్డాయి.

జీతాలందక ఇక్కట్లు..

రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది మార్చి 31 నాటికి 4436 మంది సిబ్బంది సేవలందిస్తు న్నారు. రెండు వాహ నాలకు కలిసి ఐదుగురు ఈఎంటీలు,ఐదుగురు పైలెట్లు సేవలందిస్తున్నారు. వీరికి సమయానికి జీతాలందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 108 వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. 108 వాహనాలకు సొంత గూడు కరువే.ప్రస్తుతం మండలానికి ఒక వాహనం చొప్పున వాహనాలు ఉన్నాయి. 108 వాహనాలను ప్రభుత్వమే నిర్వహించాలని ప్రైవేటు భాగస్వామ్యం లేకుండా చేయాలని సిబ్బంది అనేక ఏళ్లగా పోరాడుతున్నారు. కానీ నేటికీ అది సఫలీకృతం కాలేదు.

వాహనాల నిర్వహణ గాలికి..

108 వాహ నాల్లో మూడు రకాల వాహనాలు ఉండగా వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎల్ఎస్ వాహనాలు సేవలందిస్తుండగా పట్టణ ప్రాంతాల్లో బీఎల్ఎస్ వాహనాలు, నగరాల్లో ఏఎల్ఎస్ వాహనాలు సేవలందిస్తున్నాయి.గత ఐదేళ్లగా రోడ్లు అధ్వానస్థితికి చేరుకోవడంతో వాహనాల పరిస్థితి మరీ దుర్భరంగా మారింది. 108 వాహనానికి మరమ్మతు వస్తే కనీసం నెల రోజుల సమయం పడుతుండడం షెడ్డు నుంచి వచ్చిన రోజుల వ్యవధిలోనే మళ్లీ మరమ్మతు రావడంతో సరైన సమయానికి వాహనాలు అందుబాటులో లేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకోవడం కష్టమైపోతోంది.దీంతో చాలా ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.ఇటీవల 108 వాహనాలు తోస్తేగాని స్టార్ట్‌కాని పరిస్థితులు ఉన్నాయంటే కండీషన్ అర్థం చేసుకోవచ్చు.ఇటువంటి వాహనాలతో అత్యవసర సమయంలో ప్రాణాలకు రక్షణ ఎలా అనే దానిపై అయోమయం నెలకొంది.అత్యవసరంగా వెళుతున్న వాహనం దారి మధ్యలో నిలిచిపోతే పరిస్థితి ఏంటనే దానిపై ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం 108లపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.





నిడదవోలులో జరిగిన దీపం-2 పథకం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్ చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి, మాజీ ఎమ్మెల్యే శేషారావు ఇతర అధికారులు

రాజమహేంద్రవరంలో సిలిండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

పేదింట దీపం

జిల్లా వ్యాప్తంగా పంపిణీ ఆరంభం - తొలిరోజే 21,582 మంది బుకింగ్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి) కూటమి హామీ ఇచ్చింది.. నెర వేర్చింది.. వైసీపీ నాయకుల వ్యాఖ్యలను తిప్పికొట్టింది.. సూపర్ సిక్స్ అమలు సాధ్యమే అన్న మాటలను తిప్పికొడుతూ ఒక్కొక్కటి హామీలను నెరవేరుస్తోంది.. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఏడాది మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని శుక్రవారం ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా మూడు ఉచిత సిలిండర్ల పంపిణీ పండగ మొదలైంది.జిల్లాలో మొత్తం 7,18,794 మందికి గ్యాస్ కనెక్షన్లు ఉండగా వారిలో 5,29,070 మందిని దీపం-2 పథకం కింద గుర్తించారు. ఉచిత సిలిండర్ల పథకంలోకి దీపం పథకం లబ్ధిదారులు 1,62,702 మంది, మిగిలిన తెల్లరేషన్ కార్డుదారులకు వర్తిస్తోంది. జిల్లాలో గత నెల 29 నుంచి బుక్కింగ్ మొదలుకాగా శుక్రవారం నాటికి 21582 మంది బుక్ చేసుకున్నారు.వారిలో చాలా మందికి సిలిండర్లు అందాయి. 48 గం టల్లో వారి బ్యాంక్ ఖాతాల్లో సొమ్ము జమవుతుంది. ఇక జిల్లావ్యాప్తంగా శుక్ర వారం ఆయా నియోజకవర్గాల్లో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభించారు. నిడదవోలు రోటరీ ఆడిటోరియంలో మంత్రి కందుల దుర్గేష్ గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభించారు. మహిళలకు గ్యాస్ సిలిండర్లు అందజేశారు.రాజమహేంద్రవరం సిటీలోని గోదావరి గట్టున ప్రసాద్ గ్యాస్ ఏజెన్సీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, జేసీ ఎస్.చిన్నరాముడు,ఆర్డీవో కృష్ణనాయక్ ప్రారంభించారు. రాజమహేం ద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ధవళేశ్వరంలో గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభించారు. అనపర్తి కళావేదికలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సిలిండర్లు అందజే శారు. కొవ్వూరులో ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావు, ఆర్డీవో రాణి సుస్మిత, కమిషనర్ నాగేంద్ర కుమార్ ఇంటింటికీ వెళ్లి సిలిండర్లు పంపిణీ చేశారు. గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారకా తిరుమల మండలం జగన్నాథపురంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే మద్ది పాటి వెంకట్రాజు ప్రారంభించారు. రాజానగరంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండల కేంద్రాల్లో పంపిణీ చేశారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు అంద జేయడంపై మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

దీపం పథకం అర్హులు 2,18,590

మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దీపం -2 పథకం కింద 5,29,070 మందికి 76.95 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేకూరుస్తుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.నిడదవోలు రోటరీ ఆడిటోరియంలో శుక్రవారం దీపం-2 పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పనిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దీపం-2 పథకం కింద రూ.2,684 కోట్లు ఏడాదికి ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు అర్హత కలిగిన 2,18,590 మందిని గుర్తించామని వారిలో 21,582 మంది సిలిండర్లకు బుక్ చేసుకున్నట్టు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ఆనందంగా ఉండాలనే సీఎం చంద్రబాబు పేదింట దీపం పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎస్.చిన్నరాముడు, ఆర్‌డీఓ రాణి సుస్మిత, జిల్లా పౌర సరఫరాల అధికారి జేవీఎస్ ప్రసాద్, ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, కమీషనర్ తోట కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మానివేయన్నారని.. పురుగుల మందుతాగాడు!

చికిత్స పొందుతూ మృతి

రాజానగరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మద్యం మానివేయమని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురైన ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు.రాజానగరం మండలం కానవరం గ్రామానికి చెందిన పాటి సుబ్బారావు(50) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఆరోగ్యం పాడైంది. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు మందలించారు.దీంతో మనస్తాపానికి గురైన సుబ్బారావు గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రాజానగరం ఎస్ఐ నాగార్జున తెలిపారు.

నేడు కార్యదర్శులకు వర్క్‌షాప్

రాజమహేంద్రవరం రూరల్ నవంబరు1: జిల్లా వ్యాప్తంగా ఉన్న 300 పంచాయతీలలో ఉన్న కార్యదర్శులు, ఈవోపీఆర్డీలకు శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఆనం కళాకేంద్రంలో వర్క్‌షాప్ నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరవుతారని ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి నాగలత తెలిపారు. దీనిలో బాగంగా రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ పరిధిలో టీబీ రహిత గ్రామాలుగా ఎంపికైన 109 గ్రామ పంచాయతీ అధికారులకు టీబీ ముక్త్ అవార్డులు అందిచనున్నారు.

6 గంటలు..96 శాతం

7 గంటలు సర్వర్లు మొరాయించినా ఆగని పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సర్వర్లు మొరాయించినా పింఛన్ల పంపిణీ మాత్రం ఎక్కడా ఆగలేదు. రోజంతా కొనసాగుతూనే ఉంది. కేవలం ఆరు గంటల్లోనే ఏకంగా 2,28,995 మందికి పింఛన్లు అందించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శుక్రవారం ఏడుగంటల పాటు సర్వర్లు మొరాయించడంతో పింఛన్ల పంపిణీకి ఇబ్బంది ఏర్పడింది. పింఛనుదారులు, పంపిణీ చేసే అధికారులు ఒత్తిడికి గురయ్యారు. జిల్లాలో మొత్తం 2,38,196 పింఛనుదారులకు రూ.101 కోట్ల 62 లక్షల 95 వేల 500 పంపిణీ చేస్తారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల నుంచే జిల్లాలో సచివాలయ ఉద్యోగులు ,ఇతరులు పింఛన్ల పంపిణీ ఆరంభించారు. 7.30 గంటల వరకూ పంపిణీ బాగా సాగింది. అప్పటికే జిల్లాలో సుమారు 60 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. తర్వాత సర్వర్లు పనిచేయలేదు. అయితే సచివాలయ ఉద్యోగులు భోజనం కూడా చేయకుండా పింఛనదారుల ఇళ్ల వద్దనే ఉండిపోయారు. పింఛన్‌దారులు ఈరోజు ఇస్తారా లేదా అనే ఒత్తిడికి గురయ్యారు. చివరకు సాయంత్రం 3.30 గంటలకు సర్వర్లు పనిచేయడంతో పంపిణీ మొదలైంది. రాత్రి 7:30 గంటలకు 2,28,995 మందికి రూ.97 కోట్ల 69లక్షల 44 వేలు పంపిణీ చేశారు. కేవలం ఆరు గంటల్లో 96.26 శాతం. గత నెలలో 98 శాతం పైగా పంపిణీ చేయడం గమనార్హం. దేవరపల్లి మండలంలో బాగా తక్కువగా 94.3 శాతమే జరిగింది. కోరుకొండ మండలంలో అత్యధికంగా 97.46 శాతం జరిగింది. గత నెలలో రాష్ట్ర స్థాయిలో తొలిరోజు పింఛన్ల పంపిణీలో 3వ స్థానం లభించగా, ఈసారి 7వ స్థానానికి పడిపోయింది.



పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అత్తిలి కాలువ గట్టుకు గండి

నిడదవోలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నీటిపారుదల శాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగా కాలువకు గండి పడింది. అయితే రెవెన్యూ అధికారులు, రైతులు గండి పూడ్చడంతో పెద్ద ప్రమాదం తప్పింది. నిడదవోలు మండలం శెట్టిపేట శివారున అత్తిలి కాలువ గట్టు బలహీనపడిందని రైతులు నీటిపారుదల శాఖాధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చారు. ఇదిలా ఉండగా గురువారం అత్తిలి కాలువగట్టుకు గండి పడింది. దీంతో రైతులు రెవెన్యూ అధికారులు అప్రమత్తమై యుద్ధప్రాతిపదికన గండి పూడ్చడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అత్తిలి కాలువకు శెట్టిపేట, వేలివెన్ను మధ్య సుమారు 300 ఎకరాల ఆయకట్టు ఉంది. వరి పంట ఈనిక దశలో ఉండడంతో కాలువ నీరు పొలాలను ముంచితే పెద్ద ఎత్తున నష్టం జరిగేదని రైతాంగం ఆవేదన చెందారు. వేలివెన్ను ఉపసర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాస్, నాగరాజు నాయక్‌లు సత్వర చర్యలు చేపట్టి గండిని పూడ్చారు.



త్రుటిలో తప్పిన ప్రమాదం : అత్తిలి కాలువ గట్టుకు పడిన గండి.. పూడ్చుతున్న రైతులు

మాకెందుకీ కష్టం.. మంత్రివర్యా..!



నిడదవోలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మంత్రిగారి నియోజకవర్గంలో మహిళలు మండిపడ్డారు.. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం ప్రారంభోత్సవానికి మహిళలను తరలించాలని ఆదేశాలు అందాయి. అనుకున్నదే తడవుగా నాయకుల రంగంలోకి దిగారు. ఆ బాధ్యతను గ్యాస్ ఏజెన్సీలు తీసుకున్నాయి.. గతంలో అయితే మహిళలను ఆటోల్లో తరలించేవారు..దీంతో పెద్దగా ఇబ్బంది పడేవారు కాదు.. అయితే శుక్రవారం నిడదవోలు పట్టణంలోని రోటరీ ఆడిటోరియం వద్ద ఏర్పాటు చేసిన సభకు మహిళలను ఒక ఐషర్ వ్యాన్‌లో తీసుకొచ్చారు..ఆ వ్యాన్‌లో ఎలా దిగుతారు.. ఇదిగో ఇలా నిచ్చెన ఏర్పాటు చేసి దింపారు.. దీంతో మహిళలు చాలా ఇబ్బందిపడ్డారు.. ఒక మంత్రి పాల్గొనే సభకు ఇలా తీసుకొస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు..

అత్తింటి పేరుతో అంత్యక్రియలు వద్దు!

- పెళ్లయిన 70 రోజులకే ఆత్మహత్య
- నవ వధువు సూసైడ్ నోట్
- వరకట్న వేధింపులే కారణం

5

పచ్చని కడియంలో అమానుషం

- వివాహిత గ్యాంగ్ రేప్
- నలుగురు యువకుల అరెస్టు
- గత నెల 17న ఘటన

- మెయిన్‌లో

కార్తీకమాసం ఆరంభం. ఈనెలంతా ఒక ఆధ్యాత్మిక యాత్రలా సాగుతుంది. సూర్యోదయంలోపు స్నానాలు.. పూజలు... అభిషేకాలు, దీపారాధనలు, ఉపవాసాలు.. ఎక్కడ చూసినా భక్తి కార్యక్రమాలే కనిపిస్తాయి. మరోవైపు మాలధారణలు, అనేక సంప్రదాయాలు ఆధ్యాత్మికతకు అద్దంపడతాయి. హైటెక్ కాలంలోనూ భక్తజనం క్రమం తప్పకుండా పాటిస్తున్న ఆచార వ్యవహారాలు మరోవైపు. వనభోజనాల సందడి ఇంకోవైపు. శివకేశవులకు ప్రీతికరమైన మాసం కావడంతో దాదాపుగా అన్ని ఆలయాల్లో పూజాదికాలు నిర్వహిస్తారు. నోములు, కార్తీక పౌర్ణమి పర్వదినాల జ్వాలాతోరణం తదితర విశేష కార్యక్రమాలు సరేసరి. అటు మంచుతో కూడిన చల్లని వాతావరణం, మదిని దోచే ప్రకృతి రమణీయత.. ఇటు ఆధ్యాత్మిక తన్మయం కలగలిసిన ఈ కాలానికి శుభోదయం..

పదండి.. కార్తీకం లోకి..

ద్రాక్షారామ భీమేశ్వరాలయం



- నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు
- పంచారామ క్షేత్రాలు ముస్తాబు
- అన్ని హరిహర క్షేత్రాల్లోనూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- మాలధారణలతో భక్తి పారవశ్యం
- వనభోజనాల సందడే సందడి
- పంచారామాలు, ఏకాదశ రుద్రుల దర్శన యాత్రలకు ప్రత్యేక ఏర్పాట్లు

పంచారామాలు.. సామర్లకోట, ద్రాక్షారామ ముస్తాబు

ద్రాక్షారామ/సామర్లకోట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మహోత్సవాలకు పంచారామ క్షేత్రాలు సిద్ధమయ్యాయి. ఇందులో ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరాలయం ఇప్పటికే ముస్తాబైంది. స్వయంభువు అయిన భీమేశ్వరస్వామివారు, అష్టాదశ శక్తి పీఠాల్లో ద్వాదశశక్తి పీఠం మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలో ఇతర ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా కార్తీక సోమవారాల్లో తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. భీమేశ్వరస్వామికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిత్యం చేస్తుంటారు. ఈ మేరకు భీమేశ్వరాలయంలో స్వామివారి దర్శనానికి ఆలయ సహాయ కమిషనరు ఈవో అల్లు వెంకట దుర్గాభవానీ ఏర్పాట్లు పూర్తిచేశారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి స్వామివారిదర్శనం, అభిషేకాలు ప్రారంభం అవుతాయి. రాత్రి భక్తులు రాకను బట్టి దర్శనం గడువు 12 గంటల వరకు ఉంటుంది. ఇక సామర్లకోట భీమేశ్వరాలయం కార్తీక మాసోత్సవాలకు సిద్ధమైంది. శుక్రవారం రాత్రి వేదపండితులు ఆలయ ధ్వజస్తంభం వద్ద వేద మంత్రోచ్చారణల మధ్య ఆకాశదీప పూజలను ఘనంగా ప్రారంభించారు. శనివారం తెల్లవారుజాము నుంచి తొలి అభిషేక పూజలతో కార్తీక మాసం సంపూర్తిగా ప్రారంభవుతుందని కుమారరామ భీమేశ్వరాలయం అభిషేక పండిట్ వేమూరి సోమేశ్వరశర్మ తెలిపారు.



సామర్లకోట కుమారరామ భీమేశ్వరుడు

వనభోజనంతో పాప విముక్తి..

కార్తీక మాసంలో వనభోజనాలు అధికంగా ఉసిరిచెట్టు కింద సమారాధన చేసి బంధువులు, మిత్రులతో భోజనం చేస్తే ఎంతో మంచి జరుగుతుందని.. ఉసరిక ఉన్న వనంలో భోజనంచేస్తే పాప విముక్తులై విష్ణు లోకానికి వెళ్తారని అనేది భక్తుల నమ్మకం. ఈ మాసంలో తెల్లవారుజామున మహిళలు తెల్లవారుజామునే నిద్రలేవడం, పసుపు రాసుకోవడం, చల్లని నీటితో స్నానం చేయడం, తులసి మొక్కకు నీళ్లు పోసి చుట్టూ ప్రదక్షిణలు చేయడంలాంటివి ఇందుకు ఉపయోగపడతాయి. అల్పాహారం, మధ్యాహ్నం మిత భోజనం, రాత్రికి పండ్లు, పాలు వంటివి తీసుకోవడం, సమష్టిగా వనభోజనాలు చేయడం, ప్రకృతి ఒడిలో సేదతీరడం సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం చేస్తాయి.

ఏకాదశ రుద్రుల దర్శనయాత్ర

అంబాజీపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏకాదశ రుద్రుల శైవక్షేత్రానికి జాతీయస్థాయిలో గుర్తింపు రావడంతో కార్తీకమాసం సందర్భంగా భక్తులు వేల సంఖ్యలో తరలివస్తున్నారు. 450 శతాబ్దాల చరిత్ర కలిగిన జగన్నతోట ప్రభల ఉత్సవానికి 2020లో ప్రధాని మోదీ ఏకాదశ రుద్రుల ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలంటూ అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారంనకు చెందిన శివకేశయూత్ సభ్యులకు లేఖను రాశారు. అలాగే శృంగేరీ పీఠాధిపతి ఏకాదశ రుద్రులపై లేఖను అందించారు. ఈ ఏడాది ఢిల్లీలో జరిగిన 74వ రిపబ్లిక్ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఏకాదశ రుద్రు ప్రభల శకటం వెళ్లడంతో జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించింది. దీంతో కార్తీకమాసం సందర్భంగా ఏకాదశ రుద్రుల దర్శనానికి భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఏకాదశ రుద్రులు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట, అయినవిల్లి మండలాల్లో కొలువై ఉన్నారు. అంబాజీపేట మండలంలో సుమారు 9 గ్రామాలుండగా అయినవిల్లి, అమలాపురం మండలాలలో నేదునూరు, పాలగుమ్మి గ్రామాలున్నాయి. కార్తీకమాసంతోపాటు ఇతర రోజుల్లో ఏకాదశ రుద్రులను ఒకేరోజు దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలమని పండితులు చెబుతారు. వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వరస్వామి (విశ్వేశ్వరరుద్రుడు), గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి(సర్వేశ్వరరుద్రుడు), నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి(తికాగ్ని కాలరుద్రుడు), కె.పెదపూడి మేనకేశ్వరుడు (మహాదేవ రుద్రుడు), పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి(శ్రీమన్మహాదేవరుద్రుడు), ముక్కామల రాఘవేశ్వరస్వామి(కాలాగ్ని రుద్రుడు), వక్కలంక విశ్వేరస్వామి(త్రిపురాంతక రుద్రుడు), మొసలపల్లి మధుమానాంత భోగేశ్వరస్వామి(నీలకంఠ రుద్రుడు), పాలగుమ్మి చెన్నమల్లేశ్వరుడు(మృత్యుంజయ రుద్రుడు), గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి (సదాశివరుద్రుడు), ఇరుసుమండ ఆనందరామేశ్వరస్వామి (త్ర్యంబకేశ్వర రుద్రుడు)లను దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలమని చెబుతున్నారు.



కొవ్వూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు

ఏకాదశ రుద్రుల దర్శనం కోసం కొవ్వూరు ఆర్టీసీ డిపో ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేసింది. గతేడాది కూడా కొవ్వూరు డిపో నుంచి 100 బస్సుల వరకు రావడంతో ఈ ఏడాది దర్శనాల కోసం అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దర్శనాల కోసం సోషల్‌మీడియా ద్వారా ప్రచారం నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అల్పాహారం, విందు ఏర్పాటుచేసేందుకు ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబరు 4, 11, 18, 25 తేదీల్లో ప్రత్యేక బస్సులను కొవ్వూరు డిపో నుంచి వస్తాయి.



క్యూలైన్లను పరిశీలిస్తున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరంలో 'గిరిప్రదక్షిణ'

అన్నవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకం అంటే హరిహరులకు ఎంతో ప్రీతికరం. హరిహరక్షేత్రంగా భక్తకోటి నీరాజనాలు అందుకుంటున్న అన్నవరం పుణ్యక్షేత్రంలో కార్తీకమాసం పురస్కరించుకుని సుమారు 15 లక్షల మంది భక్తులు స్వామివారి సన్నిధికి విచ్చేసి స్వామివారి దర్శనం చేసుకుంటారు. 1.50 లక్షల వ్రతాలు జరుగుతాయి. కార్తీకమాసంలో సత్యదేవుడి గిరిప్రదక్షిణ జరగనుండగా 1.30 లక్షల మంది పాల్గొంటారు. స్వామివారి తెప్పోత్సవానికి 50 వేలమంది విచ్చేస్తారు. దీంతో ఆలయ అధికారులు భక్తుల సౌకర్యాల కల్పనకు రూ.2 కోట్లతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్‌లో సిట్టింగ్, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నారు. రూ.17.50 లక్షలతో ప్రస్తుతం ఉన్న క్యూలైన్‌కు అదనంగా 100 అడుగులు పొడవుతో రెండు వరసల్లో అదనంగా మరో 1200మందికి వీలుగా ఈ క్యూలైన్‌ను నిర్మించినట్టు ఈవో రామచంద్రమోహన్ తెలిపారు. పాడైన ఘాట్‌రోడ్డులో బీటీ రోడ్డుకు రూ.40 లక్షల వ్యయం చేశారు. రూ.12.50 లక్షలతో భక్తులకు ఎండ, వానల నుంచి రక్షణగా వాటర్‌ప్రూఫ్ షామియానాలు సిద్ధంగా ఉంచారు. రూ.39లక్షలతో వివిధ సత్రం గదుల్లో పాడైన పరుపులు, మంచాలు పిల్లోస్ కొత్తవి ఏర్పాటుచేశారు. రూ.3.50 లక్షలతో ప్రకాశ్‌సదన్ వెనుక, వనదుర్గ ఆలయం, గిరిప్రదక్షిణ మార్గాల్లో మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు, రత్నగిరినుంచి సత్యగిరి కొండకు రూ.15లక్షలతో మెట్ల మార్గం ఏర్పాటు రూ.5లక్షల వ్యయంతో తెప్పోత్సవం రోజున హంసవాహనం తీర్చిదిద్దేందుకు, రూ.9.50 లక్షలతో అదనపు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. గిరిప్రదక్షిణ రోజున రూ.3 లక్షలతో భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. సీఆర్వో కార్యాలయం ఎదురుగా 1000మంది బసచేసేందుకు వీలుగా ఉచిత డార్మెటరీ, లాకర్లను సిద్ధంగా ఉంచినట్టు ఈవో తెలిపారు. కార్తీకమాసంలో 14 రోజులు పర్వదినాలుగా గుర్తించగా, ఆయా రోజుల్లో ఒంటి గంట నుంచి వ్రతాలు రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభిస్తామని ఈవో తెలిపారు.

పర్వదినాలకు నెలవు!

అమలాపురం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శివకేశవులకు భేదం లేదని చెప్పే కార్తీక మాసం శనివారం నుంచి ప్రారంభమవుతుంది. శివకేశవులకు ప్రీతిదాయకమైన మాసంగా చెబుతారు. ఈనెల 2 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు కార్తీకమాసమని బండారులంకకు చెందిన ప్రముఖ పంచాంగకర్త కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి తెలిపారు. కార్తీకమాసంలో శివుడిని, విష్ణువును ఆరాధిస్తారు. మాసాధిపతి అయిన దామోదరుని పూజించి కేదారేశ్వరుని వ్రతం చేసుకోవడంతోపాటు చిలుకు ద్వాదశి నాడు సాలగ్రామం దానం చేయడం విశేష పుణ్య ఫలితమని చెప్పారు. ఈనెలలో 4, 11, 18, 25 తేదీలు కార్తీక సోమవారం రోజున శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు. 15న కార్తీక పౌర్ణమి జరుపుకుంటారు. అట్లతద్ది వాయనాలు తీర్చుకోనివారు కార్తీక సోమవారం, పౌర్ణమి తిథిలో తద్ది వాయనాలు తీర్చుకున్న తరువాత నోము పట్టవచ్చు. ఈనెల 2న భగినీ హస్త భోజనం, 5న నాగుల చవితి, 8న యాజ్ఞవల్క్య మహర్షి జయంతి, 9న గోపాష్టమి, 12న బోధన ఏకాదశి, 13న చిలుకుద్వాదశి-క్షీరాబ్దిపూజ, 14న వైకుంఠ చతుర్దశి, 15న కార్తీక పౌర్ణమి-జ్వాలాతోరణం, 18న సంకష్టహరచతుర్థి, 23న సత్యసాయిబాబా జన్మదినం, 29న మాసశివరాత్రి, డిసెంబరు 1 అమావాస్యతో కార్తీకమాసం పూర్తవుతుంది. ఈమాసంలో చేసే స్నాన, జప, తప, దాన, వ్రతాలకు అనంతమైన పుణ్యఫలితాలు కలగ చేస్తాయని కార్తీక పురాణం చెబుతోంది.

వివాహాది శుభ ముహుర్తాలు..

కార్తీకమాసంలో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడతాయి. అదేవిధంగా వివాహాది శుభ ముహుర్తాలు కూడా మెండుగా ఉన్నాయి. ఈ నెలలో 3, 6, 9, 10, 13, 14, 22 తేదీల్లో వివాహాలకు ముహుర్తాలు ఉన్నాయి. ఇక 4, 10, 11, 13, 14, 17, 20, 24 తేదీల్లో శంకుస్థాపనలు, 3, 4, 9, 10, 11, 13, 17, 20, 24, 25 తేదీల్లో గృహ ప్రవేశాలకు మంచి ముహుర్తాలు ఉన్నాయని భీమేశ్వరరావు సిద్ధాంతి తెలిపారు.

దీపారాధన...

శివనామస్మరణ చేస్తూ ఒత్తులను తయారు చేసి రోజుకు ఒకటి చొప్పున మొత్తంగా 365 ఒత్తులతో శివునికి దీపారాధన జరిపితే పుణ్యం లభిస్తుందని శాస్త్రం చెబుతోంది. ఈ మాసంలో ఐదు రోజుల్లో ఏకాదశి నాడు ఉపవాసం, ద్వాదశి నాడు తులసీ వివాహం, వైకుంఠ చతుర్దశినాడు ఉసిరి చెట్టుకింద దీపరాధన చేస్తారు. కార్తీక పౌర్ణమి నాడు 365 ఒత్తులతో దీపారాధన చేస్తారు. విష్ణుమూర్తికి ఇష్టమైన పౌర్ణమి రోజున స్నానాలు ఆచరించి సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తారు.

రాజమహేంద్రిలో ఘాట్లన్నీ రెడీ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో గోదావరి జిల్లాల ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో కార్తీక స్నానమాచరిస్తారు. రాజమహేంద్రవరంలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను నగరపాలక సంస్థ పూర్తిచేశారు. పవిత్రగోదావరి నదీలో కార్తీ స్నానాలచరించే భక్తుల కోసం పది రేవులను సిద్ధం చేశారు. రేవులను శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లి రేవుల్లో నీటిలో ఉన్న నాచు, ఇతర వ్యర్థాలను తీసివేశారు. రాజమహేంద్రవరంలో కోటిలింగాల రేవు, చింతాలమ్మఘాట్, పద్మావతి ఘాట్, పుష్కరాలరేవు, టీటీడీ ఘాట్, మార్కండేయఘాట్, శ్రద్ధానంద ఘాట్, పిండాలరేవు, సరస్వతి ఘాట్, గౌతమిఘాట్ తదితర రేవులను భక్తుల స్నానాలకు సిద్ధంచేశారు. రాజమహేంద్రవరం, రూరల్ పరిధిలో ఉన్న 11 రేవులలో పది రేవులు మాత్రమే స్నానాలకు అనుకూలంగా ఉంటాయి వాటిని రెడీచేశారు. రాజమహేంద్రవరంలో స్నానాల రేవుల్లో పనిచేయడానికి నగర పాలక సంస్థ పారిశుధ్యవిభాగంలో అదనంగా 90 మంది కార్మికులను ఏర్పాటుచేశారు. నగర పాలకసంస్థ రెగ్యులర్ కార్మికులతోపాటు అదనంగా వీరు పనిచేస్తారు. రేవులో రెండు షిఫ్టుల విదానంలో కార్మికులు పనిచేస్తారని శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్ తెలిపారు.



ఘాట్ల వద్ద సిద్ధమైన దుస్తులు మార్చుకునే గదులు

పాదగయ.. ముస్తాబు

పిఠాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాదగయ క్షేత్రానికి కార్తీకమాసం నెలరోజులపాటు భక్తులు పోటెత్తుతారు. సోమవారాలు, ఏకాదశి, ద్వాదశి, పౌర్ణమి పర్వదినాల్లో ఈ రద్దీ మరింత అధికంగా ఉంటుంది. కార్తీకమాసం తొలిరోజు శనివారం తెల్లవారుజామున రెండు గంటల నుంచి పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి పాడ్యమి దీపాలు వెలిగించడం ద్వారా కార్తీకమాస నోములను భక్తులు ప్రారంభానికి నాంది పలికారు.ఇళ్లవద్ద, ఆలయాల్లో పూజల్లో చేసే భక్తులంతా పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించడం సంప్రదాయం వస్తోంది. నెల రోజులపాటు పాదగయక్షేత్రంలోని రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరుగుతాయి. ప్రతి నిత్యం స్వయంభూ లింగ మూర్తి అయిన కుక్కుటేశునికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం జరుగుతుంది. అష్టాదశ శక్తిపీఠాల్లో దశమిశక్తి పీఠం అధిష్ఠాన దేవతైన పురుహూతికాఅమ్మవారికి, రాజరాజేశ్వరీదేవికి కుంకుమ పూజలు జరుగుతాయి. ఈనెల రోజులూ శనివారం నుంచి డిసెంబరు 1 వరకూ ప్రతి రోజూ తెల్లవారుజామున 4గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకూ, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ఆలయం తెరిచి ఉంటుందని ఈవో కాట్నం జగన్మోన శ్రీనివాస్ తెలియజేశారు.



వాడపల్లిలో నరకాసుర వధ

- ఆలయంలో భక్తుల సందడి
- ఆకట్టుకున్న బాణసంచా కాల్పులు



వాడపల్లి వెంకన్న ఆలయంలో నరకాసుర వధ జరుపుతున్న దృశ్యం



వాడపల్లి వెంకన్న ఆలయంలో స్వామివారి పల్లకి మహోత్సవం

ఆత్రేయపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి నరక చతుర్దశి సందర్భంగా నరకాసుర వధ జరిపారు. నరకాసుర బొమ్మకు నిప్పు పెట్టి దహనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి పల్లకి మహోత్సవం కన్నుల పండువగా జరిపారు. ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్య చక్రధరరావు దీపాలు వెలిగించి భక్తి శ్రద్ధలతో పండుగలను నిర్వహించారు. బాణసంచా కాల్చి ఆనందోత్సాహాల మధ్య దీపావళిని జరిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.1.01 లక్షల విరాళం

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రావులపాలానికి చెందిన కర్రి చిన్నభద్రారెడ్డి, శైలజ దంపతులు రూ.1,01,116 విరాళం అందించారు. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,32,461 లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

నేడు టీఎన్ఏఐ రాష్ట్ర సమావేశం

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ది ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(టీఎన్ఏఐ) రాష్ట్రశాఖ ద్వైవార్షిక సమావేశం శనివారం కాకినాడలో జరగనుంది. అసోసియేషన్ కార్యదర్శి ప్రొఫెసర్ కె.సుశీల మాట్లాడుతూ వివేకానంద పార్క్ సమీపంలోని హోటల్‌లో సదస్సు జరగనుందని, ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందులో వక్తల ప్రసంగాలతోపాటు సైంటిఫిక్ పేపర్ల ప్రజెంటేషన్, ఇన్నోవేషన్స్ ఇన్ నర్సింగ్ ప్రాక్టీస్, ఇంపాక్ట్ ఆఫ్ నర్సింగ్ లీడర్స్ తదితర అంశాలపై ప్లీనరీ సెషన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా 2400 మంది నర్సులు హాజరుకానున్నట్లు సుశీల తెలిపారు.

అప్రెంటీస్ శిక్షణకు 8న రాత పరీక్ష

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర పేపర్ మిల్స్‌లో అప్రెంటీస్ శిక్షణ కోసం ఐటీఐ అభ్యర్థులకు ఈ నెల 8న రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రాత పరీక్ష నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ క్రిష్టన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ట్రేడుల్లో సుమారు 150 ఖాళీలు వున్నాయన్నారు. ఎంపికైన వారికి ఏడాది శిక్షణతో పాటు నెలకు సుమారు రూ.8,500 స్టైఫండ్ ఇస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 7వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐలో దరఖాస్తు అందించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అప్రెంటీస్ ప్రొఫైల్ రిజిస్ట్రేషన్, కాపీ, ఐటీఐ, పదో తరగతి సర్టిఫికెట్స్, పాన్ కార్డ్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ కోరారు.

తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు సీవోవో ఏర్పాటు

జేఎన్టీయూకే, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకే అనుబంధ కళాశాలల్లో తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థుల బాగోగులు చూసుకునేందుకు మొట్టమొదటి సారిగా కల్చర్ ఆర్ఫన్ అవుట్‌రీచ్(సీవోవో) పేరుతో డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేశామని ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. సీవోవో ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబు అధ్యక్షతన వర్సిటీ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులతో శుక్రవారం ఆన్‌లైన్ సమావేశం జరిపారు. దీనికి వీసీ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ అతిథులుగా పాల్గొన్నారు.

ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ

వీసీ మాట్లాడుతూ ఈ డైరెక్టరేట్ దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థలకు రోల్‌మోడల్‌గా నిలుస్తుందన్నారు. ఇప్పటికే అనుబంధ కళాశాలల ద్వారా ఈ కేటగిరీ విద్యార్థుల వివరాలను సేకరించడంతోపాటు సీవోవో డైరెక్టరేట్ ఆధ్వర్యంలో సీవోవో వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశామన్నారు. త్వరలో అనుబంధ కళాశాలల విద్యార్థులను స్టూడెంట్ ప్రోగ్రామ్ ఎక్స్ఛేంజ్ కింద నేపాల్, తైవాన్‌లకు పంపిస్తామని, దానికి సీవోవో గ్రూపులోని విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం ఇస్తామన్నారు. వర్సిటీ పూర్వ విద్యార్థులైన ఐఏఎస్ అధికారులతో సీఆర్డీ తరగతులు, సివిల్స్ సాధనకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇప్పటివరకూ 41 మంది విద్యార్థుల వివరాలు పంపించారని వివరాలు అందజేయని విద్యార్థులు jntukcoo@gmail.com మెయిల్ ఐడీకి త్వరగా పంపించాలని డైరెక్టర్ సాయిబాబు సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రెజ్లింగ్ క్రీడాకారులు

కాకినాడఅర్బన్, నవంబరు 1: ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక శుక్రవారం డీఎస్ఏ ప్రాంగణంలో డీఎస్‌డీవో శ్రీనివాస కుమార్ ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 30 మంది హాజరవ్వగా 17 మందిని ఎంపిక చేశారు. వీరంతా ఈనెల 9, 10 తేదీల్లో అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొంటారని కోచ్ కనకదుర్గ తెలిపారు. ఫ్రీస్టైల్ ఉమెన్ 50, 53, 57, 59, 65, 72, 76 కిలోల విభాగం, బాలుర ఫ్రీ స్టైల్ 65, 70, 74, 79 కిలోల విభాగం, గ్రీకు, రోమన్, బాల బాలికల 63, 67, 72, 77, 82 కిలోల విభాగాల్లో క్రీడాకారులు ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో రెజ్లింగ్ సంఘ అధ్యక్షుడు ఎలీషాబాబు, కార్యదర్శి రామచంద్రమూర్తి పాల్గొన్నారు.





మంచు కురిసే వేళలో...

శుక్రవారం నుంచి కార్తీకమాసం మొదలవడం, మరోవైపు రాత్రి 10 దాటితే చాలు మంచు దుప్పటి ముసుగేస్తున్నది. ఉదయం 6.30 దాటినా చలితో కూడిన పొగమంచే దర్శనమిస్తోంది. పంట పొలాలు, రహదారుల వెంట శుక్రవారం పొగమంచు ఇలా కమ్మేసింది.

మండపేట, ఆంధ్రజ్యోతి



పాదగయ క్షేత్రంలో
సమాచార కమిషనరు పూజలు

పిఠాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని సమాచార కమిషనరు ఉదయభాస్కరరెడ్డి శుక్రవారం రాత్రి సందర్శించారు. సతీమణితో కలిసి కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఉదయభాస్కరరెడ్డి దంపతులను ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.



డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం

కోరుకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా జగన్నాథపురం పర్యటన కోసం శుక్రవారం మధురపూడి విమానాశ్రయానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం కొణిదల పవన్‌కల్యాణ్‌కు ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి విమానంలో మధురపూడి చేరుకున్న ఆయనకు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, బత్తుల వెంకటలక్ష్మి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అలాగే కూటమి ముఖ్య నాయకులు, పలువురు జిల్లా స్థాయి అధికారులు పవన్‌కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక కాన్వాయ్‌లో జగన్నాథపురం వెళ్లారు.

మృత్యు శకటాలు

కాకినాడ జిల్లాలో గురు, శుక్రవారాల్లో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. లారీలు వెనుక నుంచి ఢీకొనడంతోనే ఇవి చోటుచేసుకున్నాయి.

లారీ ఢీకొని
హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం



రామచంద్రరావు (పాత చిత్రం)

సర్పవరం జంక్షన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ సర్పవరం జంక్షన్‌లో శుక్రవారం రాత్రి ఒక లారీ బీభత్సం సృష్టించింది. విధుల్లో వున్న హెడ్ కానిస్టేబుల్‌ను పొట్టనపెట్టుకుంది. కాకినాడ రూరల్ రమణయ్యపేట జనచైతన్య కాలనీకి చెందిన ముంగళ్ల రామచంద్రరావు (61) సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో (2688) హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం రాత్రి పోలీస్ స్టేషన్ నుంచి బైక్‌పై సర్పవరం జంక్షన్ వైపు బయల్దేరాడు. ఈ సమయంలో అచ్చంపేట నుంచి సర్పవరం జంక్షన్ వైపు వెళ్తున్న లారీ వెనకాల నుంచి వచ్చి ఢీకొట్టింది. రామచంద్రరావు బైక్‌పై నుంచి రోడ్డుపై కుడి వైపు పడిపోవడంతో లారీ ఆయన శరీరంపై నుంచి వెళ్లిపోయింది. తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పక్కనే పోలీస్‌స్టేషన్ ఉండటంతో సీఐ బి.పెద్దిరాజు సిబ్బందితో హుటాహుటీన వచ్చి ఆస్పత్రికి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. అప్పటికే మృతి చెందడంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. లారీ డ్రైవర్ వేగంగా వెనకాల నుంచి ఢీకొట్టడంతోనే రామచంద్రరావు మృతి చెందాడని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతుడికి భార్య శ్యామల, కుమారుడు విజయశేఖర్, కుమార్తె అరవిందదేవి ఉన్నారు. అప్పటిదాకా పోలీస్‌స్టేషన్‌లో ఉండి కేసు విషయమై తమతో మాట్లాడి బయటకెళ్లిన కొద్ది నిమిషాల వ్యవధిలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని సహచర పోలీసులు తెలిపారు. మరో ఏడాదిలో ఉద్యోగ విరమణ చేస్తున్నానని, ప్రభుత్వం వయోపరిమితి పెంచకపోతే ఏడాది కిందటే రిటైరయ్యేవాడినని తరచూ తమతో అనేవారని వారు చెప్పారు.

షాపింగ్‌కు వెళ్లి తిరిగొస్తుండగా...

వెనుక నుంచి లారీ ఢీకొని భార్య మృతి
భర్తకు గాయాలు



స్వర్ణలత (పాత చిత్రం)

గండేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో జగ్గంపేటకు చెందిన స్వర్ణలత (23) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్వర్ణలత భర్త సతీష్‌కుమార్‌తో కలిసి స్కూటీపై పండుగకు షాపింగ్ చేయడానికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో వెనుక నుంచి ఓ ట్యాంకర్ అతి వేగంతో వచ్చి వారి వాహనాన్ని ఢీకొంది. వెనుక కూర్చున స్వర్ణలత కింద పడిపోగా ఆమె తలపై నుంచి లారీ వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త సతీష్ కాలుకి గాయాలయ్యాయి. దీపావళి తమ ఇంట విషాదం మిగిల్చిందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. స్వర్ణలతకు ఒక కుమార్తె ఉంది. విషయం తెలిసిన ఎస్ఐ శివ నాగబాబు సంఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దీపావళి రోజు దారుణం

- కాకినాడ జిల్లా కాజులూరు మండలం శలపాకలో ముగ్గురు దారుణ హత్య
- కత్తులతో నరికి.. గునపాలతో పొడిచి రాడ్లతో విచక్షణారహితంగా దాడి
- మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తింపు
- హత్యలకు పాల్పడింది ఇంటి ఎదురుగా ఉన్న మరో కుటుంబమే
- ఐదుగురు నిందితుల్లో పోలీసుల అదుపులో ముగ్గురు

కాకినాడ/కాజులూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం శలపాక గ్రామం గురువారం రాత్రి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. దీపావళి రోజు రాత్రి అందరూ టపాసులు పేల్చి సంబరాల్లో ఉంటే గ్రామం మాత్రం కత్తుల కరాళ నృత్యంతో వణికిపోయింది. ముగ్గురి దారుణ హత్యతో భీతిల్లింది. కాజులూరు మండలం గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని శలపాకలో గురువారం రాత్రి తొమ్మిది గంటలకు జరిగిన ఈ హత్యోదంతానికి సంబంధించి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలివి.

శలపాక గ్రామంలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన బత్తుల చిన్నయ్య, పొట్లకాయల నాగేశ్వరరావు ఎదురెదురు ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. చిన్నయ్య సోదరుడు రాజు, కుమారుడు రమేష్ ఒకే ఇంట్లో ఉంటున్నారు. చిన్నయ్య, రాజు ఇద్దరి భార్యలు ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటున్నారు. కాగా నాగేశ్వరరావు భార్య బేబీతో బత్తుల చిన్నయ్యకు వివాహేతర సంబంధం ఉందంటూ గ్రామంలో ప్రచారం జరుగుతోంది. నాగేశ్వరరావును ఉద్దేశించి నీ భార్యను నేను ఉంచుకున్నాను.. నువ్వు చేతకానివాడివిరా.. నువ్వేం చేస్తావు అంటూ నాగేశ్వరరావును తరచూ బత్తుల చిన్నయ్య కుటుంబం వేధిస్తున్నట్టు నాగేశ్వరరావు పలుసార్లు గ్రామపెద్దల దృష్టికి తీసుకువెళ్లాడు. పెద్దలు సర్దిచెప్పినా చిన్నయ్య, ఆయన కుటుంబం మాత్రం తరచూ నాగేశ్వరరావును భార్య విషయంలో సూటిపోటి మాటలతో వేధించేవారు. మూడు రోజుల కిందట కూడా నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి బత్తుల కుటుంబం గొడవ చేసింది. దీంతో నాగేశ్వరరావు కుటుంబం కూడా బత్తుల కుటుంబంతో గొడవకు దిగి మాటమాట అనుకున్నారు. ఈ సమయంలో మళ్లీ చిన్నయ్య కుటుంబ సభ్యులు నాగేశ్వరరావును దూషిస్తూ హేళనగా మాట్లాడారు. ఆయన భార్య బేబీని బత్తుల చిన్నయ్య, బత్తుల రాజు అసభ్యకర పదజాలంతో దూషించారు. మూడు రోజుల కిందట జరిగిన గొడవ సద్దుమణిగిందని అంతా అనుకున్నారు. కానీ గురువారం రాత్రి మళ్లీ రెండు కుటుంబాల మధ్య గొడవ పెరిగింది. ఈ క్రమంలో బత్తుల కుటుంబసభ్యులు నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి బూతులతో విరుచుకుపడ్డారు. దీంతో తీవ్ర ఆగ్రహంతో ఉన్న నాగేశ్వరరావు, ఆయన భార్య బేబీ, కుమారులు బత్తుల కుటుంబ వేధింపులు భరించలేక దాడికి దిగారు. ఇంట్లో ఉన్న కత్తులు, గునపాలు తెచ్చి బత్తుల చిన్నయ్య (42), బత్తుల రాజు (40), చిన్నయ్య కొడుకు బత్తుల రమేష్ (25), బంధువు బత్తుల శ్రీనుపై దాడికి దిగారు.

కరెంటు తీసేసి.. దారుణంగా చంపేసి..

గొడవకు ముందే పథకం ప్రకారం హత్యకు స్కెచ్ వేసినట్టు పోలీసులు చెప్తున్నారు. ఇందులో భాగంగా గొడవకు ముందు ఇంట్లో మారణాయుధాలు సిద్ధం చేయడం, మరో మనిషితో ఇంటి వద్ద విద్యుత్ దీపాలు ఆపేసి చీకటి ఉండేలా ప్లాన్ చేశారు. ఈ క్రమంలో బత్తుల చిన్నయ్య, బత్తుల రాజు, బత్తుల రమేష్



శలపాకలో పోలీసు పహారా

గొడవ పడుతుండగా ఇంట్లోంచి నాగేశ్వరరావు, ఆయన భార్య బేబీ, ఇతర కుటుంబసభ్యులు సుబ్రహ్మణ్యం, దొరబాబు, వినోద్ తదితరులు కత్తులు, గునపాలతో బత్తుల కుటుంబానికి చెందిన నలుగురిపై దాడికి దిగారు. కత్తులతో ఉదరం, ఛాతి, మెడపై నరికేశారు. గునపాలతోనూ విచక్షణారహితంగా పొడిచేశారు. మృతుల్లో ఇద్దరు పారిపోయే ప్రయత్నం చేయగా వెంటాడి వెంటాడి నరికేశారు. గునపాలతో పొడవడంతో బత్తుల చిన్నయ్య, బత్తుల రాజు, బత్తుల రమేష్ ముగ్గురు రక్తపు మడుగులో విలవిల్లాడారు. అదే సమయంలో వీరు ముగ్గురినీ తలపైనా గునపాలతో పొడిచేశారు. వెంట ఉన్న ఇనుపరాడ్లతో తలపై బలంగా దాడి చేశారు. దీంతో ఇద్దరికి మెదడు బయటకు రాగా, కళ్లు ఛిద్రమైపోయాయి. మరొకరి తల పూర్తిగా వేరు పడిపోయింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. అనంతరం మృతదేహాలపైకి ద్విచక్రవాహనాలను ఎక్కించి మరింత నుజ్జునుజ్జు చేశారు. ఆ తర్వాత ఇంకా ఎవరొస్తారో రండి అంటూ నిందితులు అరుపులు, కేకలు వేశారు. చిమ్మచీకటి కావడంతో చుట్టుపక్కల ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రాలేదు. అందరూ భయంగా ఇళ్లలోకి వెళ్లిపోయి తలుపులు వేసేసుకున్నారు. హత్య చేసిన తర్వాత నిందితులు తమ చేతుల్లోని కత్తులను మరణించిన వారి చేతుల్లో ఉంచి పరారయ్యారు. ఆ తర్వాత సమాచారం స్థానిక సర్పంచ్‌కు తెలియడంతో పోలీసులకు సమాచారం అందించారు. దాడిలో గాయాలతో తప్పించుకున్న బత్తుల శ్రీనును కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

ఎస్పీ పరిశీలన

విషయం తెలిసిన కాకినాడ ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సంఘటనాస్థలానికి వెళ్లి హత్య జరిగిన తీరును పరిశీలించారు. గ్రామంలో అల్లర్లు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతదేహాలను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కాగా హత్య ఘటనపై గొల్లపాలెం ఎస్ఐ మోహన్‌కుమార్ మాట్లాడుతూ... ఈ రెండు కుటుంబాల మధ్య కొన్నేళ్లుగా ఘర్షణ జరుగుతోందన్నారు. నాగేశ్వరరావు భార్య బేబీని చనిపోయిన చిన్నయ్య తరచూ అసభ్య పదజాలంతో దూషిస్తుండడం హత్యకు కారణమని వివరించారు. నిందితులైన నాగేశ్వరరావు, బేబీ, సుబ్రహ్మణ్యంలను అదుపులోకి తీసుకున్నామన్నారు.

ఒకరి తర్వాత ఒకరిని నరికేశారు

మా పెదనాన్నతో నాగేశ్వరరావు కుటుంబం గొడవపెట్టుకుంది. గొడవ సమయంలో నాగేశ్వరరావు, బేబీ మా పెదనాన్నపై కత్తులతో దాడి చేసి చంపేశారు. విషయం తెలిసి వారిని అడ్డుకోవడానికి వెళ్లిన రాజు, రమేష్‌లను కూడా దారుణంగా కత్తులతో నరికేసి గునపాలతో పొడిచేశారు. చనిపోయిన తర్వాత వారిపైకి ద్విచక్రవాహనాలు ఎక్కించి తొక్కించారు. మా వారిని విచక్షణారహితంగా నరికేశారు. కాపాడండి అంటూ వాళ్లు ఆర్తనాదాలు పెట్టారు. రాడ్లు, కత్తులతో ఎక్కడపడితే అక్కడ పొడిచేసి చంపేశారు. గొడవ గురించి తెలిసి వెళ్లిన నన్ను కూడా చంపేస్తామని బెదిరించారు.

-రాజశ్రీ, బత్తుల చిన్నయ్య బంధువు

ముగ్గురూ అక్కడే చనిపోయి కనిపించారు

నాగేశ్వరరావు కుటుంబసభ్యులు బత్తుల కుటుంబీకులను ముగ్గురినీ దారుణంగా హత్య చేసిన తర్వాత స్థానికులు నాకు ఫోన్ చేసి విషయం చెప్పారు. వెంటనే ఎస్ఐకు సమాచారం ఇచ్చాను. నేను సంఘటనాస్థలానికి వెళ్లి చూడగా ముగ్గురూ అక్కడే చనిపోయి కనిపించారు.

-గనిరాజు, సర్పంచ్, శలపాక

పెళ్లైన రెండు నెలలకే...



ప్రత్యూష (పాత చిత్రం)

- వివాహిత బలవన్మరణం
- పుట్టింటి పేరుతోనే అంత్యక్రియలు జరపాలని సూసైడ్ నోట్
- అత్తింటి వేధింపులే కారణమని తండ్రి ఫిర్యాదు
- భర్త, అత్త, మామ అరెస్టు

రాజమహేంద్రవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెళ్లయిన రెండు నెలలకే ఓ వివాహిత బలవంతంగా ప్రాణాలు తీసుకుంది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో దీపావళి రోజున జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి.... అమలకంటి వెంకట ప్రసాద్ కాంట్రాక్టరుగా జీవనం సాగిస్తూ రాజమహేంద్రవరం కంబాలచెరువు సమీపంలోని లోలుగు అపార్ట్‌మెంట్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కూతురు ప్రత్యూష (26)కు ఆగస్టు 22న పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన కత్తి నాగ సత్య శ్రీనివాసరావు కుమారుడు వంశీ రాధాకృష్ణకు ఇచ్చి వివాహం జరిపించాడు. అతడు చెన్నైలోని చెన్నై పెట్రో కెమికల్స్ (సీపీసీఎల్) లిమిటెడ్ కంపెనీలో చార్టర్డ్ అక్కౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. పెళ్లయిన తర్వాత రెండు రోజులు ఇద్దరూ పాలకొల్లులో ఉన్నారు. తర్వాత అతడు చెన్నై వెళ్లిపోయాడు. అబ్బాయి తల్లిదండ్రులు, ప్రత్యూష తల్లిదండ్రులు ఆమెను తీసుకెళ్లి చెన్నైలో దిగబెట్టారు. వారం తర్వాత ప్రత్యూషను రాధాకృష్ణ తీసుకొచ్చి తమ ఇంటి వద్ద దించేసి వెళ్లిపోయాడని ఫిర్యాదులో ప్రసాద్ పేర్కొన్నారు. తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫలితం లేకపోయిందన్నారు. తమ కూతురిని విచారించగా తన బాధలు చెప్పుకుంటూ కన్నీటి పర్యంతమైందన్నారు. 'హోమియోపతి మెడిసిన్ కోర్సు డిస్‌కంటిన్యూ చేసిన నన్ను ఉద్యోగం చేయాలని బలవంతం చేస్తున్నారు. ఉద్యోగం చేస్తావనే నిన్ను చేసుకున్నాం. రూ.3 కోట్లు కట్నం ఇస్తామన్న సంబంధాలు వదులుకున్నాం. పెళ్లి సమయంలో మీ వాళ్లు ఇస్తానన్న స్థలం అమ్మేసి డబ్బులు తీసుకురా. చెన్నైలో ఫ్లాట్ కొంటాం' అని మానసికంగా వేధిస్తున్నారని చెప్పిందన్నారు. పెళ్లి సమయంలో రూ.5 లక్షలు కట్నం ఇవ్వడంతో పాటు 15 కాసుల బంగారం పెట్టామన్నారు. తాము అల్లుడితో ఫోనులో మాట్లాడడానికి చాలాసార్లు ప్రయత్నించామన్నారు. వినాయక చవితి, దసరాకు రమ్మన్నా ఏదోక సాకు చెప్పేవాడని తెలిపారు. తమ అమ్మాయి భర్తకు ఫోన్ చేస్తే మాట్లాడేవాడు కాదన్నారు. పెళ్లయిన రెండు నెలలకే తన సంసారం ఇలా కావడం, పుట్టింట్లో ఉండిపోవడంపై తీవ్రంగా ఆవేదన చెందడంతో పాటు మానసికంగా కుంగిపోయిందన్నారు. తనకు గుండెపోటు రావడంతో చికిత్స జరిగిందని, అప్పటి నుంచీ ఇంటి దగ్గరే ఉండడంతో తాము నచ్చజెప్తూ వచ్చామన్నారు. అయితే దీపావళి ముందు రోజున బుధవారం రాత్రి తీవ్రంగా ఏడ్చిందన్నారు. తాము సముదాయించామని, కాస్త కుదుట పడిందని అనుకున్నామన్నారు. 11గంటల సమయంలో తన గదిలోకి వెళ్లిపోయిందని చెప్పారు. దీపావళి రోజున ఉదయం ఏడు గంటలకు తన భార్య నాగమణి గది తుడవడం కోసం వెళ్లి చూడగా చున్నీతో ఫ్యానుకు ఉరి వేసుకున్న స్థితిలో ప్రత్యూష కనిపించిందన్నారు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. తన కూతురు మరణానికి భర్త రాధాకృష్ణ, మామ నాగ సత్య శ్రీనివాస్, అత్త పద్మప్రియ వేధింపులే కారణమని ఫిర్యాదులో తండ్రి పేర్కొన్నారు.

● పుట్టింటి పేరుతోనే...

ప్రత్యూష రాసినట్టు భావిస్తున్న మరణ వాంగ్మూలం లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తన అంత్యక్రియలను అత్తవారింటి పేరుతో చేయవద్దని, పుట్టింటి పేరుతోనే చేయాలని అందులో పేర్కొనడం చూస్తే ఆమె ఎంత వేదనకు గురైందోనని స్థానికులు కన్నీరు పెట్టుకున్నారు. కేసును సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేశ్‌బాబు దర్యాప్తు చేస్తున్నారు. భర్త రాధాకృష్ణ, మామ నాగ సత్య శ్రీనివాస్, అత్త పద్మప్రియలను అరెస్టు చేశారు. శనివారం కోర్టులో హాజరుపరచనున్నారు.

'పోలవరం'పై జగన్
అనవసర రాద్ధాంతం

అభివృద్ధి ఓర్వలేకే ప్రభుత్వంపై ఆరోపణలు: కార్మిక శాఖ మంత్రి సుభాష్



రామచంద్రపురంలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రజల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుపై మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనవసరపు రాద్ధాంతం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వ్యాఖ్యానించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏనాడూ పోలవరం ప్రాజెక్టుపై దృష్టిసారించకుండా కాలయాపన చేశారన్నారు. రివర్స్ టెండరింగ్ పేరుతో రూ.628 కోట్లు ఆదా చేసినట్టు గొప్పలు చెప్పుకుని రూ.2,268 కోట్ల అదనపు భారం మోపారన్నారు. సకాలంలో పనులు చేపట్టకపోవడంతో వేల కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. టీడీపీ ప్రభుత్వం రూ.11,762 కోట్లతో 73శాతం పనులు పూర్తి చేయగా జగన్ హయాంలో రూ.4,100 కోట్లతో 3.28 శాతం పనులు మాత్రమే చేశారన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే ప్రాజెక్టు పనులు ఊపందుకున్నాయన్నారు. తమ హయాంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వ లేకే జగన్ విషవాయువులు వదులుతున్నారన్నారు. ప్రాజెక్టు తొలిదశను పూర్తి చేసేందుకు రూ.30,436 కోట్లు ఇవ్వడానికి కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపిందన్నారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆగదన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ ప్రాజెక్టు పూర్తయ్యే వరకు శ్రమిస్తూనే ఉంటారన్నారు. ఇటీవలి ప్రకృతి వైపరీత్యాలు, కార్తీక మాసం కూరగాయల ధరలపై కొంత ప్రభావం చూపిన మాట వాస్తవేమన్నారు. నూనెలు, మినపపప్పు, పెసరపప్పు, చింతపండు ధరలు అదుపులోనే ఉన్నాయన్నారు. నిత్యావసర వస్తువు ధరలపై మాట్లాడేందుకు వైసీపీ నాయకులు చర్చకు సిద్ధమా అన్నారు. నిత్యం సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తూ ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

విహారంలో విషాదం

సోకిలేరు వాగు ఉధృతిలో కొట్టుకుపోయి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



మార్చురీలో సాయికృష్ణ మృతదేహం

చింతూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం సోకిలేరు వ్యూ పాయింట్ వద్ద వాగు ఉధృతిలో కొట్టుకుపోయి అమినిగడ్డ సాయికృష్ణ (29) మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి మృతుడి సోదరుడు రవీంద్ర తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... ప్రకాశం జిల్లా కాకుటూరివారిపాలేనికి చెందిన సాయికృష్ణ, నాగసాయి, నాగార్జున, రవీంద్ర, వంశీ హైదరాబాద్‌లోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిలో వంశీ మినహా మిగిలిన నలుగురూ అన్నదమ్ముల పిల్లలు. వంశీ వీరందరికీ స్నేహితుడు. కాగా దీపావళి సందర్భంగా వచ్చిన సెలవుల నేపథ్యంలో వీరంతా పర్యాటక ప్రదేశాలను సందర్శించాలనుకున్నారు. ఈ క్రమంలో మూడు ద్విచక్ర వాహనాలపై హైదరాబాద్ నుంచి ఈ ఐదుగురు గురువారం బయల్దేరారు. శుక్రవారం ఉదయం భద్రాచలం చేరుకుని సీతారామచంద్రస్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. దీంతో ప్రయాణం చింతూరు మండలం మీదుగా సాగింది. మార్గమధ్యంలో సోకిలేరు వ్యూ పాయింట్ వద్ద ఆగారు. అప్పటికే పలువురు పర్యాటకులు సోకిలేరు వాగు నీటిలో స్నానం చేస్తున్నారు. అది చూసిన యువకులు కూడా వాగులో స్నానం చేయాలనుకున్నారు. ఈ క్రమంలో సాయికృష్ణ, నాగసాయి, నాగార్జున కూడా వాగులోకి దిగారు. నీటి ఉధృతికి సాయికృష్ణ కొట్టుకుపోయాడు. దీనిని గమనించిన అక్కడున్న పర్యాటకుల సహకారంతో సాయికృష్ణ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. అక్కడి నుంచి మిగిలిన నలుగురూ సాయికృష్ణ మృతదేహాన్ని చింతూరు ఏరియా ఆసుపత్రికి ఆటోలో తరలించారు. ఆసుపత్రి వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు.

మృత్యుంజయులు

- కెరటాల ఉధృతికి సముద్రంలో మునిగిపోయిన ఇద్దరు బాలురు
- మెరైన్ పోలీసుల సూచనతో కాపాడిన మత్స్యకారులు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న మెరైన్ ఏఎస్ఐ మధు, హెచ్‌సీ శ్రీను

సర్పవరం జంక్షన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి నాడు సాయంత్రం సమయంలో ఆనందంగా గడిపేందుకు వెళ్లి సముద్రంలో స్నానానికి దిగి కెరటాల ఉధృతికి కొట్టుకుపోతున్న ఇద్దరు బాలురను మెరైన్ పోలీసులు కాపాడారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేట శివారు గైగోలుపాడుకు చెందిన 16ఏళ్ల పిల్లి గణేష్, 17 ఏళ్ల షేక్ బషీర్ వలీ గురువారం మధ్యాహ్నం సూర్యారావుపేట బీచ్‌కు వెళ్లారు. కొద్దిసేపు ఆనందంగా గడిపిన తర్వాత సముద్రంలో స్నానానికి దిగారు. ఈ సమయంలో కెరటాల ఉధృతికి సముద్రంలో పడి ఇద్దరు మునిగిపోతున్నారు. వాకలపూడి మెరైన్ సీఐ రామోహ్మన్‌రెడ్డి ఆధ్వర్యంలో తీర ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న కాకినాడ మెరైన్ ఏఎస్ఐ మధు, హెడ్ కానిస్టేబుల్ శ్రీను గమనించారు. అక్కడే ఉన్న మత్స్యకారులను అప్రమత్తం చేయడంతో వారు సముద్రంలోకెళ్లి మునిగిపోతున్న గణేష్, బషీర్‌వలీలను కాపాడి ఒడ్డుకు తీసుకువచ్చి సపర్యలు చేశారు. బాలురు వివరాలను సేకరించిన ఏఎస్ఐ మధు తల్లిదండ్రులకు సమాచారం అందివ్వడంతో వారు బీచ్‌కు వచ్చారు. ఈసందర్భంగా పిల్లలు, తల్లిదండ్రులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. తమ పిల్లలను కాపాడిన పోలీసులు, మత్స్యకారులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్ కస్టడీ నుంచి రిమాండ్‌కు శ్రీకాంత్

అమలాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలానికి చెందిన దళిత వలంటీర్ జనుపల్లి దుర్గాప్రసాద్ హత్యకేసులో ప్రధాన నిందితుడైన పినిపే శ్రీకాంత్, రెండో నిందితుడు ధర్మేష్‌లను మూడు రోజుల పోలీస్ కస్టడీ అనంతరం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. కొత్తపేట డీఎస్పీ గోవిందరావు ఆధ్వర్యంలో గత నెల 30, 31, నవంబరు 1న అంబాజీపేట పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాదులు ఎండీ అజామ్, కుడుపూడి అశోక్ సమక్షంలో పోలీసులు నిందితులిద్దరినీ ప్రశ్నించారు. పోలీస్ కస్టడీ ముగియడంతో శుక్రవారం పోలీసులు అమలాపురం కోర్టులో హాజరుపరిచారు. శ్రీకాంత్‌కు నాలుగు రోజుల రిమాండ్ ఉండగా, ధర్మేష్‌కు మళ్లీ 14 రోజుల రిమాండ్‌ను కోర్టు విధించింది. దీంతో వారిని సెంట్రల్ జైలుకు తరలించారు.

మండపేట రూరల్ ఎస్ఐ సురేష్‌పై సస్పెన్షన్ వేటు

మండపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట రూరల్ ఎస్ఐ డి.సురేష్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 28న మండపేట మండలం ఏడిదలో ఒక ఇంట్లో బాణసంచా తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలి ఒక వ్యక్తి మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. ఆ ఘటనకు ఎస్ఐ సురేష్ నిర్లక్ష్యమే కారణమంటూ సస్పెన్షన్ వేటు వేసినట్టు తెలిసింది. ఎటువంటి సంబంధం లేని ఎస్ఐను సస్పెండ్ చేయడాన్ని సహచర సిబ్బంది జీర్ణించుకో లేక పోతున్నారు. ఈ అంశం పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది.

చెరువులు.. రహదారులు

అధ్వానంగా తంటికొండ-గాదెలపాలెం-ఇటికాయిలపల్లి రహదారులు



చెరువులా ఉన్న గాదెలపాలెం-ఇటికాయిలపల్లి రహదారి

గోకవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రోడ్ల నిర్వహణను పూర్తిగా పక్కన పెట్టేశారు. గడిచిన ఐదేళ్ల ప్రయాణికులు రోడ్లపై ప్రయాణించేందుకు నానా అవస్థలు పడ్డారు. గోకవరం మండలంలోని తంటికొండ-గాదెలపాలెం, గాదెలపాలెం-ఇటికాయిలపల్లి రహదారి అధ్వానంగా మారింది. రోడ్లపై పెద్దపెద్ద గోతులు ఏర్పడి చెరువులను తలపిస్తున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా గోతుల్లోకి భారీగా నీరు చేరుతోంది. దీంతో వాహనదారులు అదుపుతప్పి ఆ గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. అంతంత మాత్రంగానే ఉన్న ఈరోడ్లపై గ్రావెల్‌తో భారీ వాహనాలు ప్రయాణించడం వల్ల మరింత దెబ్బతిన్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా అధ్వానంగా ఉన్న తంటికొండ-గాదెలపాలెం, గాదెలపాలెం-ఇటికాయిల పల్లి రోడ్ల నిర్మాణాలపై ఎమ్మెల్యే నెహ్రూ ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని మూడు గ్రామాల ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.



తంటికొండ-గాదెలపాలెం రహదారి దుస్థితి

కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో

నైపుణాభివృద్ధి శిక్షణా కేంద్రం

ఆశ్రమాన్ని పరిశీలించిన జిల్లా ఇన్‌చార్జి దేవకీ దేవి



ఆశ్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి దేవకీ దేవి

సీతానగరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి విశ్వకర్మ నైపుణ్య అభివృద్ధి శిక్షణా కేంద్రం ఏర్పాటు విషయమై శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి దేవకీ దేవి, బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ కేంద్రంలో 25ఏళ్ల లోపు విద్యార్థులకు హాస్టల్ వసతితో పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు దేవి తెలిపారు. అయితే విద్యార్థినులతో పాటు విద్యార్థులు కూడా ఉంటారని, అందుకు ఆశ్రమం అనుమతి అవసరమన్నారు. అయితే ఇద్దరికీ వేరువేరు వసతితో పాటు హాస్టల్ సదుపాయం కూడా వేరుగా ఉండేలా ఏర్పాటు చేస్తామన్నారు. ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటామన్నారు. మొత్తం 40నుంచి 45 మంది ఉంటారని, వారిలో విద్యార్థినులు ఎక్కువగా ఉంటారని చెప్పారు. అయితే ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ అడపా మురళీకృష్ణ బీజేపీ నాయకులు ఏపీఆర్ చౌదరి, నియోజకవర్గ ఇన్‌చారిజ నీరుకొండ వీరన్నచౌదరి, మండలాధ్యక్షుడు గూడపాటి జయరామ్, అధ్యక్షురాలు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపు రాజమహేంద్రవరంలో

శెట్టిబలిజ వనసమారాధన

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జాతీయ రహదారి వద్ద చెరుకూరి తోటలో ఈ నెల 3న శెట్టిబలిజ వనసమారాధన నిర్వహించనున్నట్టు రాష్ట్ర శెట్టిబలిజ సంఘం ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు తెలిపారు. చేరుకూరి తోటలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వనభోజనాలతో పాటు శెట్టిబలిజ వధువరుల పరిచయవేదిక కూడా నిర్వహిస్తున్నామని, రాష్ట్రంలోని సంఘీయులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహణ కమిటీ ప్రతినిధులు మట్టపర్తి సత్యనారాయణ, ఆనెం చిన్న, నాయకులు మునసా అప్పారావు, దొమ్మేటి వెంకటేశ్వరరావు తదితరులతో కలిసి వనభోజనాల ప్రచార రథాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీఎస్‌పీ ప్రతాప్, పిల్లి రామ్‌ప్రసాద్, గుత్తుల గోపినాథ్, పిల్లి శ్రీను పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు నియామకాల్లో

ఆర్యవైశ్యులపై చిన్నచూపు

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బలభద్ర

దివాన్‌చెరువు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు నియామకంలో ఆర్యవైశ్యులను చిన్న చూపు చూడడం తగదని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బలబద్ర సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తమకు న్యాయం చేసామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చాక తమ సంఘీయులను కూరలో కరివేపాకులా తీసిపారవేసి కించపరచడం సమంజసంకాదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్యవైశ్యులకు తగుస్థానం కల్పించారన్నారు. ప్రస్తుత టీటీడీ బోర్డులో కనీసం సభ్యుడిగానైనా ఆర్యవైశ్యులకు అవకాశం కల్పించలేదని వాపోయారు.

దేశానికి 'పటేల్' విశేష సేవలు

దివాన్‌చెరువు, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): భారతదేశ మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి విశేష సేవలందించారని ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో ఓఎన్‌జీసీ సహకారంతో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పటేల్ నాయకత్వ లక్షణాలను వివరించారు. వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల కోఆర్డినేటర్లు ఎస్.రాజ్యలక్ష్మి, వి.పద్మావతి, ఎంవీఎస్ఎస్ నారాయణ, వై.సుష్మాప్రియ, బి.రాజశేఖర్, ఎల్.ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కడియం, నవంబరు 1: కడియం మండలం జేగురుపాడు గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. సుమారు 30-40 ఏళ్ల వయసున్న వ్యక్తి జేగురుపాడు పంట పొలంలోని చిన్నగొయ్యిలో అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నాడు. ఒంటిపై ఆకాశ రంగు మీద నలుపు నిలువు చారలు చొక్కా, నలుపు రంగు ప్యాంటు, నీలం రంగు ప్లాస్టిక్ చెప్పులు ఉన్నాయని తెలిపారు. ఎస్ఐ ధనలక్ష్మి ప్రసన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తన సినిమా పాటలతో మూడు దశాబ్దాల పాటు తెలుగు ప్రజల మన్ననలందుకున్న కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి అని నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల తెలుగుశాఖ, కళాగౌతమి సంయుక్త నిర్వహణలో శుక్రవారం దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సత్యనారాయణ మాట్లాడుతూ కోటి కోయిలలు ఒక్క గొంతుకతో పాట పాడితే ఎలా ఉంటుందో దేవులపల్లి పాటను అలా ఉంటుందన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

బిక్కవోలు, నవంబరు 1(నవంబరు): బిక్కవోలులో ప్రాథమిక పాఠశాలను ఎంఈవో కె.పూర్ణచంద్రరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల వర్క్‌బుక్ పరిశీలించి, సిలబస్ ప్రకారం బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

సీఎం సహాయ నిధి

చెక్కుల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో ఆర్థిక ఇబ్బందులకు గురైన వారికి సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని తన నివాసంలో పిడింగొయ్యి గ్రామానికి చెందిన చాచారి నారాయణమూర్తికి రూ.2,40,509, తొర్రేడుకు చెందిన పెనుమర్తి వరలక్ష్మికి రూ.40,524 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వారి కుటుంబ సభ్యులకు గోరంట్ల అందజేశారు. కార్యక్రమంలో మత్యేటి ప్రసాద్, మార్ని వాసుదేవరావు, మట్ట శ్రీను, ముప్పిడి రాంబాబు, చిచారి సుబ్బారావు, మద్ద మణి కోరాడ వెంకటేష్ పాల్గొన్నారు.

రెండు తాటాకిళ్లు దగ్ధం

గోకవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి, పెంటపల్లి గ్రామాల్లో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదాల్లో రెండు తాటాకిళ్ల దగ్ధమయ్యాయి. ఈ ఘటనల్లో బాధితులు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. కొత్తపల్లిలో గండేపల్లి మంగాయమ్మ, బొజ్జప లక్ష్మిలకు చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఇంట్లోని గృహోపకరణాలతో పాటు, ఇతర సామగ్రి కాలిబూడిదయ్యాయి. ఆస్తినష్టం సుమారు రూ.2 లక్షల ఉండవచ్చని అంచనా. పెంటపల్లిలో కొండా కృష్ణకు చెందిన తాటాకిల్లు కూడా షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతైంది. ఆస్తి నష్టం సుమారు రూ.1.50లక్షల ఉండవచ్చని అంచనా. రెండు చోట్ల బాధితులను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరామర్శించి బియ్యం, నగదు, బట్టలు, నిత్యావసర సరుకులు అందజేశారు.

తమ్ముడి అదృశ్యంపై ఫిర్యాదు

కడియం, నవంబరు 1: తన తమ్ముడు కనిపించడం లేదంటూ ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జేగురుపాడులో శివాలయం వీధికి చెందిన 30 ఏళ్ల వెత్సపల్లి శివ గత నెల 29వ తేదీ మధ్యాహ్నం పుట్టినరోజు ఫంక్షన్‌కు వెళుతున్నట్టు చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ దొరక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి వెళ్లే సమయంలో ఒంటిపై గ్రీన్‌కలర్ షర్ట్, వైట్‌కలర్ ప్యాంటు ఉన్నాయని శివ అన్నయ్య సుబ్రహ్మణ్యం ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మాట నిలబెట్టుకున్నాం

» ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

» ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ



కోరుకొండలో సిలిండర్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేసి మాట నిలబెట్టుకున్నామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు.రాజమహేంద్రవరం గోదావరి గట్టునున్న రజక కల్యాణ మండపంలో శుక్రవారం దీపం పథకం-2 పేరుతో నిర్వహించిన ఉచిత గ్యాస్ సిలెండర్ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే వాసుతో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, ఆర్డీవో కృష్ణనాయక్ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రాష్ట్రాన్ని పది లక్షల కోట్ల అప్పులోకి నెట్టేసి జగన్ అండ్ కో పార్టీ వెళ్లిపోయిందన్నారు. అయినప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం ఒక్కొక్కటిగా నేరవేరుస్తున్నామన్నారు. ఇప్పటికే ఉచిత ఇసుక, అన్న క్యాంటీన్లు, పింఛన్ల పంపిణీ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నామన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోరని చెప్పారు. జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్డీవో కృష్ణనాయక్ మాట్లాడుతూ ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకంపై ఏమైనా సమస్యలుంటే 1967 టోల్ ఫ్రీ నెంబరుకు చేయాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులైన మహిళలకు ఉచిత గ్యాస్ సిలెండర్లు అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, నాయకులు బుడ్డిగ రాధా, యిన్నమూరి దీపు, నిమ్మలపూడి గోవింద్, సప్పా వెంకటరమణ, నల్లం శ్రీను, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి: గోరంట్ల

ధవళేశ్వరం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరంలోని పోలీస్‌స్టేషన్ వీధిలోని గ్యాస్ కంపెనీ వద్ద ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని జాయింట్ కలెక్టర్ చినరాముడుతో కలిసి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రారంభించారు. ఈ సందర్భం గా నిర్వహించిన సభలో మాట్లాడుతూ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూనే ఎన్ని కల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. ఎన్నికల హామీ మేరకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, గ్యాస్ కంపెనీ యజమానులు మామిడి అప్పాజీ, వేగిశెట్టి కోదండ రామారావు, నాయకులు మచ్చేటి ప్రసాద్, పందూరి అప్పారావు, వాసిరెడ్డి బాబి, తలారి మూర్తి, ఆళ్ల ఆనంద రావు, నాళ్ళ రమేష్, నీలి కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి: బత్తుల

రాజానగరం/సీతానగరం/కోరుకొండ నవంబరు1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మండల కేంద్రాలైన రాజానగరం, సీతానగరం, కోరుకొండ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి దీపం-2 పథకం ద్వారా మంజూరైన ఉచిత గ్యాస్ సిలెండర్లను లబ్ధిదారు లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ఏడాది మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్ల అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నియోజకవర్గంలో మొత్తం 60,192 గ్యాస్ కనెక్షన్లు ఉండగా, వీరిలో 52,920 మంది ఈ పథకానికి అర్హులుగా ఉన్నారని, మిగిలిన వారు ప్రభుత్వోద్యోగులు, సంపన్నులు కావడం వల్ల వర్తించలేదన్నారు. సిలెండర్ డెలివరీ అయిన 48 గంటల్లోనే రాయితీ సొమ్మును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాసేన కోసం నా వంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు, ఎంపీటీసీ కుర్రే నాగబాబు, బచ్చు ప్రసాద్, ఏపీఆర్ చౌదరి, నీరుకొండ వీరన్నచౌదరి, గూడపాటి జయరామ్, వలవల రాజా, కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు కృషి : నల్లమిల్లి



గోకవరంలో సిలిండర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

అనపర్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని కళావేదికలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ఉచిత గ్యాస్ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనపర్తి నియోజకవ ర్గంలో తెలుపు రేషన్ కార్డు ఉన్న 21వేల కుటుం బాలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీకి ప్రభుత్వం రూ.5 కోట్లు వెచ్చిస్తుందన్నారు. కెనాల్ రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రచార ఆర్భాటాలకు సొమ్ములు వృథా చేశారని కూటమి ప్రభుత్వంలో ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడే విధంగానే కృషి చేస్తున్నామన్నారు. సివిల్‌సప్లై జిల్లా అధికారిణి రాధిక ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల కూటమి నాయకులు, తహసీల్దార్లు, ఎమ్‌పీడీవోలు, మహాశక్తి మహిళలు పాల్గొన్నారు. కాగా ఇదే వేదికపై.. ఇటీవల నిర్వ హించిన రంగంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీల భర్తీ కార్యక్రమంలో నూతనంగా ఎంపికైన కార్యకర్తలు, ఆయాలకు ఎమ్మెల్యే నల్లమిల్లి నియామక పత్రాలను అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవాభావంతో విధులు నిర్వర్తించాలని చెప్పారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం : నెహ్రూ

గోకవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గోకవరం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీపం పథకం-2ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రానున్న రోజుల్లో ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం పథకాలను కూడా సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, జనపరెడ్డి సుబ్బారావు, గాజింగం సత్తిబాబు, మంగరౌతు రాము, ఉంగరాల రాము, అడపా భరత్, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో సిలిండర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కడియం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళలు నర్సరీలోకి పనులకు వెళ్లే, వచ్చే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని కడియం సీఐ ఎ.వెంకటేశ్వరరావు చెప్పారు. బుర్రిలంక నర్సరీల్లో పనులకు వెళ్లే మహిళలకు అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఒంటరిగా కాకుండా అందరూ కలిసి వెళ్లేలా చూసుకోవాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే 112కి కాల్ చేయాలన్నారు.

తొలగించిన పింఛన్లను పునరుద్ధరిస్తాం

» ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు » ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తొలగించిన పింఛనుదారుల అర్హతలను పరిశీలించి వాటిని పునరుద్ధరిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలో 21,24,25 డివిజన్లలో శుక్రవారం ఉదయం 6గంటలకే కూటమి నాయకులతో కలిసి ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సకాలంలో పింఛన్లు పంపిణీ చేయడం వల్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. స్థానిక 42వ డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ పింఛన్లు పంపిణీ చేశారు. హామీలన్నీ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. అలాగే డివిజన్‌లో టీడీపీ సభ్యత్వ నమోదును పరిశీలించారు. స్థానిక గౌతమి జీవకారుణ్య సంఘంలో వృద్ధులకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ చేతుల మీదుగా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు.కార్యక్రమాల్లో చాంబర్ అధ్యక్షుడు తవ్వా రాజా, మళ్ల వెంకట్రాజు, వానపల్లి శ్రీనివాసరావు, సింహాద్రి కోటిలింగేశ్వరరావు, కేవీ శ్రీనివాస్, సింహాద్రి లోకేష్, సావిత్రి పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని మెళ్లూరులో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి ఎన్‌డీఏ కూటమి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో రావాడ నాగు, ఇందల వీరబాబు, అచ్యుతరామయ్య, కొర్ల వినాయకరావు తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలో 10612 పింఛనుదారులుండగా మొదటి రోజైన శుక్రవారం 10,081 మంది(95 శాతం) మందికి పింఛన్లు పంపిణీ చేశామని, మిగిలిన వారికి శనివారం పంపిణీ చేస్తామని ఎంపీడీవో వి.శ్రీనివాస్ పేర్కొన్నారు.

కొవ్వూరు: పట్టణంలోని 13 వార్డులో పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆర్డీవో రాణి సుస్మిత శుక్రవారం ప్రారంభించారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు సాంకేతిక సమస్యలు తలెత్తడంతో సర్వర్ పనిచేయక మొదటిరోజు పింఛన్ల పంపిణీ ఆలస్యమైంది. పట్టణంలో 91.08 శాతం పంపిణీ చేసినట్టు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. మండలంలోని 16 గ్రామాల్లో మొదటిరోజు 92.05శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, దాయన రామకృష్ణ పాల్గొన్నారు.

నిర్మాణాలు నాణ్యతాలోపం లేకుండా జరగాలి

రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్



ఫుట్‌పాత్‌లు పరిశీలన చేస్తున్న కమిషనర్ కేతన్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో జరుగుతున్న రోడ్లు, ఫుట్‌పాత్‌ల నిర్మాణాలు నాణ్యతాలోపాలు లేకుండా జరగాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శుక్రవారం ఆయన నగరంలోని ఏవీ అప్పారావు రోడ్డు, కంబాల చెరువు, ఏకేసీ కాలేజీ పార్కు, భాస్కర్‌నగర్ తదితర ప్రాంతాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో పచ్చదనాన్ని పెంచి పర్యావరణహితంగా తయారు చేయాలని, పార్కుల్లో మొక్కలను, లాన్‌లను శ్రద్ధగా నిర్వహించాలని, పార్కుల్లో పనిచేసే సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అందరూ ఎమినిటీస్ కార్యదర్శులు తమ సచివాలయ పరిధిలో పార్కులను, డివైడర్ల ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మొక్కల నిర్వహణ సక్రమంగా ఉండేటట్లు చూడాలన్నారు. జేఎన్‌రోడ్డు, ఏవీ రోడ్డు, ఫుట్‌పాత్ టైల్స్ దెబ్బతినకుండా చూసుకోవాలని, ఎక్కడైనా రిపేర్లు చేయవలసివస్తే వెంటనే చేపట్టాలని లేకుంటే మిగతా ఫుట్‌పాత్ కూడా దెబ్బతింటుందని చెప్పారు. రోడ్లు వేసినాక బెర్మ్ కూడా వెంటనే పూర్తి చేయాలని, రోడ్‌లో రెండు పక్కలా డ్రైన్‌వుంటే బెర్మ్ డ్రైన్ల వరకు వేయాలని ఆదేశాలిచ్చారు. భాస్కర్‌నగర్ పార్కును అభివృద్ధి చేయడానికి వెంటనే ప్రతిపాదన తయారు చేయాలన్నారు. కమిషనర్ వెంట కార్పొరేషన్ ఈఈ షేక్ మదర్సా ఆలీ, డిఈఈ పి ప్రసాద్, లోవరాజు, హార్టికల్చర్ ఏడీ కె.స్వాతి, ఏఈ షర్మిళ తదితరులున్నారు.

సందడిగా దీపావళి



గోకవరం/రంగంపేట, నవంబరు1(ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకలు గురువారం రాత్రి సందడిగా జరిగాయి. ప్రతి ఒక్కరూ ఇళ్లను శుభ్రపరిచి రంగవల్లులు తీర్చిదిద్దారు. తెల్లవారు జామున తలంటు స్నానాలు చేసి, సాంప్రదాయ దుస్తులు ధరించి, స్థానిక దేవాలయాల్లోనూ, సాయంత్రం తులసికోట, లక్ష్మీదేవి చిత్రపటాల వద్ద ప్రత్యేక దీపారాధన, పూజలు చేశారు. ఇంటి ఆవరణను ప్రమిదల్లో నూనె పోసిన దీపాలతోను, రంగురంగుల విద్యుద్దీపాలతోను సుందరంగా అలంకరించారు. సాయంత్రం 6గంటలు అయ్యేసరికి బాణసంచా కాల్చడం ప్రారంభించారు. పరస్పరం మిఠాయిలు పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దివిటీల సాంప్రదాయం ఉన్న కుటుంబాలు దివిటీలు కొట్టుకొని లోకమంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా చిన్నారులు, యువత వివిధ రకాల బాణసంచాలను కాల్చుతూ సందడిలో మునిగి తేలియాడారు. గత ఏడాదితో పోలిస్తే టపాసుల ధరలు భారీగా పెరిగాయి. అయినప్పటికీ కొనుగోలుదారులతో బాణసంచా దుకాణాలు కిటకిటలాడాయి. అర్ధరాత్రి వరకు యువకులు రోడ్లపై తిరుగుతూ బాణసంచా మోతలతో హోరెత్తించారు.

నరసన్న సన్నిధిలో

కార్తీక మాస నిత్యాన్నదానం

కోరుకొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో 30రోజుల పాటు నిత్యన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆయన ఆలయం వద్ద మాట్లాడుతూ నరసింహస్వామి కొండపైన, దిగువున తాగునీరు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులందరికీ 30 రోజుల పాటు నిత్యన్నదానం జరుగుతుందని, ఇందు కోసం ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నామని, పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ఐదుగురు సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు తాటికొండ శ్రీను, కటకం చలం, సర్పంచ్ కర్రి లక్ష్మీ సరోజ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ ఓటు నమోదు

రంగంపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఈ నెల 2వ తేదీ ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 వరకు ఎమ్మెల్సీ (పట్టభద్రుల) ఎలక్షన్‌కి సంబంధించి ఓటు నమోదుకు స్పెషల్ డ్రైవ్ జరుగుతుందని తహశీల్దార్ ఉండవల్లి రంజిత్‌కుమార్ శుక్రవారం తెలిపారు. 31-10-2021 నాటికి ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా తత్సమాన డిగ్రీ పొందిన పట్టభద్రులు తమ ఓటు గుర్తింపుకార్డు, ఆధార్‌కార్డు, డిగ్రీ సర్టిఫికెట్, జిరాక్స్ కాపీలు, ఒక పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో వచ్చి ఫారం-18కు జతచేసి ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

నేటి నుంచి కార్తీక స్నానాలు

దివాన్‌చెరువు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శివకేశవులకు ప్రీతికరమైన మాసం కార్తీకం. ఈనెల రోజులు చాలామంది మాంసాహారాన్ని తీసుకోకుండా అత్యంత నియమ నిష్టలతో ఎంతో పవిత్రంగా పూజలు చేస్తారు. నదీస్నానాలు, పూజలు, వ్రతాలు, దానాలు, ఉపవాసాలతో బాటు వనభోజనాలతో ఈనెల అంతా భక్తి పారవశ్యంతో గడుపుతారు. ఈనెలలో ప్రతీ రోజూ చాలాముఖ్యమైనదిగా చెబుతారు. ఇక ఈ మాసంలో భక్తి, ముక్తిని ఇచ్చే వనభోజనాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రాముఖ్యత ఉంది.

చిరస్మరణీయుడు శ్రీరాములు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి ఉన్నంత వరకు అమరజీవి పొట్టి శ్రీరాములు చరిత్ర చిరస్మరణీయమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాజమహేంద్రవరం డీలక్స్ సెంటర్ వద్ద శ్రీరాములు విగ్రహానికి ఆయన పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన మహనీయుడు పొట్టి శ్రీరాములని, ఆయన ఆమరణ దీక్ష ఫలితంగానే ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. కార్యక్రమలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరావు, చాంబర్ అధ్యక్షుడు తవ్వా రాజా, యిన్నమూరి దీపు, నల్లం శ్రీను, దాస్యం ప్రసాద్, చాపల న్నరాజు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌రోడ్డు సెంటర్లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు కృషి, త్యాగం ఫలితంగానే ఆంధ్ర రాష్ట్ర అవతరణ జరిగిందని, కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో వీర వెంకట్రావు, కె.సుధారాణి, వలంటీర్లు పాల్గొన్నారు.

ఏబీ నాగేశ్వరరావు జయంతి



నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం


రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మచ్చలేని రాజకీయ జీవితాన్ని సాగించిన మహనీయుడు డాక్టర్ ఏబీ నాగేశ్వరరావని ఆంధ్రకేసరి యువజన సమితి కీర్తించింది. ఏబీ నాగేశ్వరరావు జయంతిని శుక్రవారం సీతంపేటలోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. సమితి అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నందూరి సుబ్బారావు, మాదిరా శ్రీనివాస్, గుడిపూడి సునీల్‌గౌతమ్, ప్రణవ్, ఫాల్గొణ పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి పడిపూజ

రంగంపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రంగంపేట ఏడీబీ రోడ్ పక్కనున్న వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శ్రీ మణికంఠ క్షేత్రం వద్ద ఈ నెల 2వ తేదీన అయ్యప్పస్వామి పడి పూజ నిర్వహించనున్నట్టు గురుస్వామి చొల్లంగి అర్జునరావు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు జరిగే కార్యక్రమాలన్నింటిలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ శనివారం గణపతి హోమం, ఉమారామలింగేశ్వరస్వామికి జలాభిషేకం, మహాఅన్నదానం, అఖండ హారతితో ఊరేగింపు, లక్ష బిల్వార్చన, సామూహిక పడిపూజ,సామూహిక భజన జరుగుతాయని చెప్పారు.



ద్రాక్షారామ భీమేశ్వరాలయం



సామర్లకోట భీమేశ్వరాలయంలో..



అంబాజీపేటలో ప్రత్యేక అలంకరణలో వ్యాఘ్రేశ్వరస్వామి




రాజమహేంద్రవరంలో గోదావరి ఘాట్

ఆధ్యాత్మిక.. ఆనందం

నేటి నుంచి కార్తీకం

ఆరనీకుమా ఈ దీపం.. కార్తీక దీపం.. చేర నీ పాద దీపం కర్పూర దీపం.. కార్తీక మాసం అంటే అంత ప్రత్యేకత మరి.. కార్తీక మాసంలో చేసే స్నాన, జప, తప, దాన, వ్రతాలకు అనంతమైన పుణ్యఫలితాలు వస్తాయని కార్తీక పురాణం చెబుతోంది.. అందుకే ఏడాదంతా ఎలా ఉన్నా.. ఆ శివయ్యను ప్రసన్నం చేసుకునేందుకు ఈ నెలంతా ఆధ్యాత్మికత ఆనందకరమైన వాతావరణమే.. కార్తీక మాసం వచ్చిందంటే ఆ సందడే వేరు.. ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగి తేలాల్సిందే.. ఆ శివయ్యను కనులారా చూడాల్సిందే.. దీనికి ఎక్కడికో వెళ్లాల్సిన పనిలేదు.. మన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎక్కడా లేనన్ని ప్రధాన శైవ క్షేత్రాలు ఉన్నాయి.. ఒక పక్క పంచారామ క్షేత్రాలు.. సామర్లకోట కుమారరామం.. ద్రాక్షారామ భీమేశ్వరుడు.. మరోపక్క పాదగయ.. ఇంకో పక్క ఏకాదశ రుద్రులు ఇలా చెప్పుకుంటూ పోతే.. ఎన్నెన్నో ప్రముఖ ఆలయాలు ఉన్నాయి.. కార్తీకం అంటే హరి హరులకు ఎంతో ప్రీతికరం.. ఈ మాసంలో అన్నవరంలో చేసే గిరి ప్రదక్షిణ ప్రత్యేకమే.. కార్తీక దీపాలు వదిలేందుకు వచ్చే భక్తులతో రాజమహేంద్రవరం, కొవ్వూరు గోదావరి ఘాట్లు కళకళలాడతాయి. హరోం..హర.. హరహర మహాదేవ శంభో శంకర.. నినాదాలతో మారుమ్రోగుతాయి.. ఈ క్షేత్రాలన్నీ చూడగలమా అంటారా.. ఎందుకు చూడలేరు.. ఆర్టీసీ నుంచి ప్రత్యేక దర్శనయాత్రలు ఉన్నాయి.. ఇక్కడి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని శైవక్షేత్రాలకు బస్సులు ఏర్పాటు చేశారు.. ఇంతేనా అంటే.. ఇక కుటుంబీ కులతో సరదాగా గడిపే వన భోజనాలకు ఈ మాసమే అనుకూలం.. అందుకే ఈ నెలంతా ఆధ్యాత్మికం.. ఆనందం..

నెలంతా.. ఆకాశదీపం



అన్నవరంలో..

అన్నవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాస ప్రారంభసూచికగా శుక్రవారం రాత్రి పాడ్యమి తిథి తగలడంతో సత్యదేవుడి సన్నిధిలో ఆకాశదీపం ఏర్పాటు చేశారు. అనివేటి మండపంలో ప్రత్యేక పూజలు చేసి నలుదిక్కులా దర్శించేలా నాలుగు దీపాలను ఏర్పాటు చేసి ప్రత్యేక తాళ్లతో ధ్వజస్తంభం పైభాగంలో ఏర్పాటుచేశారు. అదే విధంగా సామర్లకోట కుమారరామంలో కూడా ఆకాశదీపం ఏర్పాటు చేశారు. కార్తీక మాసం నెలరోజులూ ఈ ఆకాశదీపం వెలుగుతూ ఉంటుంది. భక్తులు ఆకాశదీపం దర్శించుకుంటే జీవితంలో చీకట్లు తొలగి ఆయురారోగ్యాలతో ఉంటారని పండితులు పేర్కొన్నారు.



నేటి నుంచి రోడ్లకు రిపేర్లు

1332 కి.మీ..రూ.11.92 కోట్లు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి) గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రోడ్లు ధ్వంసమైన సంగతి తెలిసిందే.కనీసం గోతులకు మరమ్మతులు చేయలేదు. కూటమి ప్రభుత్వం మొదటగా మరమ్మతులపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా జిల్లావ్యాప్తంగా రోడ్లలో మొదట శనివారం నుంచి గోతులు పూడ్చి వేస్తారు. జనవరి 15వ తేదీ లోపు మొత్తం పనులు పూర్తి కావాలి. తర్వాత కొత్తరోడ్ల నిర్మాణం చేపడతారు.జిల్లాలో 1338.743 కిలోమీటర్ల మేర గుంతలు పూడ్చడానికి టెండర్లు పిలిచామని 1,95,989 పనులకు రూ.1192 లక్షలు మంజూ రయ్యాయని జిల్లా ఆర్‌అండ్‌బీ ఈఈ ఎస్‌బీవీ.రెడ్డి తెలిపారు. రాజమహేంద్రవరం అర్బన్‌లో 28.298 కిలోమీటర్లలో ఒక కిలోమీటరుకు రూ.5లక్షలు, రూరల్‌లో 201.426 కిలోమీటర్లకు సంబంధించి 43.730 కి.మీలకు రూ.272 లక్షలు మంజూరయ్యా యన్నారు. రాజానగరంలో 324.760 పనులు గుర్తించగా 71 పనులకు రూ.337 లక్షలు, అనపర్తిలో 214.123 పనులు గుర్తించగా 15,340 కిలోమీటర్లకు 198 లక్షలు, గోకవరం మండలంలో 64.482 పనులకు గుర్తించగా 14 పనులకు 85లక్షలు మంజూరయ్యాయన్నారు. రాజమహేం ద్రవరం డివిజన్‌లో మొత్తం 833.093 కిలోమీటర్ల మేర టెండర్లు పిలవగా ఇప్పటికే 145.070 కిలోమీటర్లకు 897 లక్షలు మంజూరైనట్టు చెప్పారు.కొవ్వూరులో 194.816 కిలోమీటర్లకు టెండర్లు పిలవగా 6.121 కిలోమీటర్లకు 42 లక్షలు, నిడదవోలులో 155.765 కిలోమీటర్లలోని 15,598 కిలోమీటర్లకు రూ.79 లక్షలు, గోపాలపురంలో 155.069 కిలోమీటర్లకు 29.200 కిలోమీటర్లకు 174 లక్షలు మంజూరయ్యాయన్నారు. మొత్తం కొవ్వూరు డివిజన్లకు 505.650 కిలోమీటర్లకు టెండర్లు పిలవగా 50.919 కిలోమీటర్లకు రూ.295లక్షలు మంజూరయ్యాయన్నారు. శనివారం అన్ని నియోజకవర్గాల్లో పనులు ప్రారంభిస్తారు

వచ్చే వరకూ.. డౌటే!



అత్యవసరమైనా..ఆలస్యమే

- పనిచేయని కుయ్ కుయ్‌లు
- సమయానికి రాని 108లు
- మరమ్మతులే కారణం
- అస్తవ్యస్తంగా అత్యవసర సేవలు
- చివరి నిమిషంలో అవస్థ
- కూటమి ప్రభుత్వంపై ఆశలు

ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో బుధవారం పిడుగుపడి బాణసంచా తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం సంభవించిన ఘటన విధితమే.. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా మరో ఐదుగురు తీవ్రగాయాల పాలయ్యారు..స్థానికులు స్పందించి వెంటనే 108 కు ఫోన్ చేశారు.. అయితే 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న తణుకు నుంచి 108 రావడానికి గంటన్నర పట్టింది. దీంతో అప్పటి వరకూ క్షతగాత్రులు ఆపసోపాలు పడుతూనే ఉన్నారు.. ఈ ఒక్క సంఘటన చాలు 108లు ఎంత అత్యవసరంగా పనిచేస్తున్నాయో చెప్పడానికి..

అనపర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అత్యవసరంగా సేవలందించేది 108.. అటువంటి వాహనాలు ఎలా ఉండాలి.. కుయ్.. కుయ్ అంటూ..రయ్..రయ్‌న పరుగులు పెట్టాలి.. అయితే ప్రస్తుతం ఉన్న వాహనాలు ఎలా ఉన్నాయో తెలుసా..ఆగితే స్టార్ట్ కావు.. స్టార్ట్ అయితే ఆగవు అనేలా ఉన్నాయి.ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను కాపాడే వాహనాలు నేడు ప్రాణ సంకటంగా మారాయి.కాలం చెల్లిన వాహనాల కారణంగా అటు సిబ్బంది, ఇటు క్షతగాత్రులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.ప్రమాదంలో గాయపడిన వారు సమయానికి 108లు రాక ప్రాణాలు కోల్పోతున్నారు.108 వాహనాలకు రూపకల్పన చేసి రెండు దశాబ్దాలవుతున్నా నిర్వ హణ గాలికొదిలేయడంతో ఇబ్బందులు తప్పడంలేదు.

2005 నుంచి ప్రారంభం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి సత్యం కంప్యూటర్స్ భాగస్వామ్యంతో 2005 ఆగస్టు 15న 108 వాహనాలు రూపొందించి సేవలు ప్రారంభించారు. ఆపద సమయంలో ఉన్న వ్యక్తికి తక్షణ వైద్యం అందించాలన్న సంకల్పంతో ఈ ఉచిత సర్వీసులను తెచ్చారు. తొలుత ఎనిమిది వాహనాలను వైఎస్ఆర్ ప్రారంభించారు. మూడు నెలల వ్యవధిలోనే వీటి సంఖ్య 35కు చేరుకుని విశేష సేవలందించడం ప్రారంభించాయి. 2007వ సంవత్సరం వచ్చేసరికి వీటి సంఖ్య 375కు చేరింది. జిల్లాకు పది వాహనాల చొప్పున అందుబాటులోకి తెచ్చారు. ప్రధాన నగరాల్లో జనాభాకు తగినట్టుగా వాహనాలను కేటాయించడంతో 108 సేవలు ఊపందుకున్నాయి. అదే సమయంలో మూడు మండలాలకు ఒక వాహనం చొప్పున కేటాయించి సేవలందించేవారు. 2014లో రాష్ట్ర విభజన జరిగే నాటికి ఉమ్మడి రాష్ట్రంలో 820 వాహనాలు ఉండగా వీటిలో 445 వాహనాలను ఏపీకి కేటాయించారు. అప్పటి నుంచి ఏపీలో టీవీజీ సంస్థ భాగస్వామ్యంతో సేవలందించారు.అయితే 2019 వచ్చే సరికి వీటి సంఖ్య 627కి పెరిగింది. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మండలానికి ఒక వాహనం ఉండాలని 104, 108 వాహనాలను వెయ్యి వరకు పెంచారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 814 వాహనాలు అరబిందో ఫౌండేషన్ సంస్థ ద్వారా సేవల్లో ఉండగా వీటిలో 25 శాతం వాహనాలు మూలన పడ్డాయి.

జీతాలందక ఇక్కట్లు..

రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది మార్చి 31 నాటికి 4436 మంది సిబ్బంది సేవలందిస్తు న్నారు. రెండు వాహ నాలకు కలిసి ఐదుగురు ఈఎంటీలు,ఐదుగురు పైలెట్లు సేవలందిస్తున్నారు. వీరికి సమయానికి జీతాలందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 108 వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. 108 వాహనాలకు సొంత గూడు కరువే.ప్రస్తుతం మండలానికి ఒక వాహనం చొప్పున వాహనాలు ఉన్నాయి. 108 వాహనాలను ప్రభుత్వమే నిర్వహించాలని ప్రైవేటు భాగస్వామ్యం లేకుండా చేయాలని సిబ్బంది అనేక ఏళ్లగా పోరాడుతున్నారు. కానీ నేటికీ అది సఫలీకృతం కాలేదు.

వాహనాల నిర్వహణ గాలికి..

108 వాహ నాల్లో మూడు రకాల వాహనాలు ఉండగా వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎల్ఎస్ వాహనాలు సేవలందిస్తుండగా పట్టణ ప్రాంతాల్లో బీఎల్ఎస్ వాహనాలు, నగరాల్లో ఏఎల్ఎస్ వాహనాలు సేవలందిస్తున్నాయి.గత ఐదేళ్లగా రోడ్లు అధ్వానస్థితికి చేరుకోవడంతో వాహనాల పరిస్థితి మరీ దుర్భరంగా మారింది. 108 వాహనానికి మరమ్మతు వస్తే కనీసం నెల రోజుల సమయం పడుతుండడం షెడ్డు నుంచి వచ్చిన రోజుల వ్యవధిలోనే మళ్లీ మరమ్మతు రావడంతో సరైన సమయానికి వాహనాలు అందుబాటులో లేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకోవడం కష్టమైపోతోంది.దీంతో చాలా ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.ఇటీవల 108 వాహనాలు తోస్తేగాని స్టార్ట్‌కాని పరిస్థితులు ఉన్నాయంటే కండీషన్ అర్థం చేసుకోవచ్చు.ఇటువంటి వాహనాలతో అత్యవసర సమయంలో ప్రాణాలకు రక్షణ ఎలా అనే దానిపై అయోమయం నెలకొంది.అత్యవసరంగా వెళుతున్న వాహనం దారి మధ్యలో నిలిచిపోతే పరిస్థితి ఏంటనే దానిపై ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం 108లపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.





నిడదవోలులో దీపం-2 పథకం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్ చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి, మాజీ ఎమ్మెల్యే శేషారావు ... కొవ్వూరులో ఇంటికి వెళ్లి సిలిండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, ఆర్‌డీవో సుస్మితా రాణి తదితరులు

పేదింట దీపం

జిల్లా వ్యాప్తంగా పంపిణీ ఆరంభం - తొలిరోజే 21,582 మంది బుకింగ్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి) కూటమి హామీ ఇచ్చింది.. నెర వేర్చింది.. వైసీపీ నాయకుల వ్యాఖ్యలను తిప్పికొట్టింది.. సూపర్ సిక్స్ అమలు సాధ్యమే అన్న మాటలను తిప్పికొడుతూ ఒక్కొక్కటి హామీలను నెరవేరుస్తోంది.. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఏడాది మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని శుక్రవారం ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా మూడు ఉచిత సిలిండర్ల పంపిణీ పండగ మొదలైంది.జిల్లాలో మొత్తం 7,18,794 మందికి గ్యాస్ కనెక్షన్లు ఉండగా వారిలో 5,29,070 మందిని దీపం-2 పథకం కింద గుర్తించారు. ఉచిత సిలిండర్ల పథకంలోకి దీపం పథకం లబ్ధిదారులు 1,62,702 మంది, మిగిలిన తెల్లరేషన్ కార్డుదారులకు వర్తిస్తోంది. జిల్లాలో గత నెల 29 నుంచి బుక్కింగ్ మొదలుకాగా శుక్రవారం నాటికి 21582 మంది బుక్ చేసుకున్నారు.వారిలో చాలా మందికి సిలిండర్లు అందాయి. 48 గం టల్లో వారి బ్యాంక్ ఖాతాల్లో సొమ్ము జమవుతుంది. ఇక జిల్లావ్యాప్తంగా శుక్ర వారం ఆయా నియోజకవర్గాల్లో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభించారు. నిడదవోలు రోటరీ ఆడిటోరియంలో మంత్రి కందుల దుర్గేష్ గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభించారు. మహిళలకు గ్యాస్ సిలిండర్లు అందజేశారు.రాజమహేంద్రవరం సిటీలోని గోదావరి గట్టున ప్రసాద్ గ్యాస్ ఏజెన్సీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, జేసీ ఎస్.చిన్నరాముడు,ఆర్డీవో కృష్ణనాయక్ ప్రారంభించారు. రాజమహేం ద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ధవళేశ్వరంలో గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభించారు. అనపర్తి కళావేదికలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సిలిండర్లు అందజే శారు. కొవ్వూరులో ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావు, ఆర్డీవో రాణి సుస్మిత, కమిషనర్ నాగేంద్ర కుమార్ ఇంటింటికీ వెళ్లి సిలిండర్లు పంపిణీ చేశారు. గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారకా తిరుమల మండలం జగన్నాథపురంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే మద్ది పాటి వెంకట్రాజు ప్రారంభించారు. రాజానగరంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండల కేంద్రాల్లో పంపిణీ చేశారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు అంద జేయడంపై మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

దీపం పథకం అర్హులు 2,18,590

మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దీపం -2 పథకం కింద 5,29,070 మందికి 76.95 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేకూరుస్తుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.నిడదవోలు రోటరీ ఆడిటోరియంలో శుక్రవారం దీపం-2 పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పనిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దీపం-2 పథకం కింద రూ.2,684 కోట్లు ఏడాదికి ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు అర్హత కలిగిన 2,18,590 మందిని గుర్తించామని వారిలో 21,582 మంది సిలిండర్లకు బుక్ చేసుకున్నట్టు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ఆనందంగా ఉండాలనే సీఎం చంద్రబాబు పేదింట దీపం పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎస్.చిన్నరాముడు, ఆర్‌డీఓ రాణి సుస్మిత, జిల్లా పౌర సరఫరాల అధికారి జేవీఎస్ ప్రసాద్, చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమీషనర్ తోట కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మానివేయన్నారని.. పురుగుల మందుతాగాడు!

చికిత్స పొందుతూ మృతి

రాజానగరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మద్యం మానివేయమని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురైన ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు.రాజానగరం మండలం కానవరం గ్రామానికి చెందిన పాటి సుబ్బారావు(50) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఆరోగ్యం పాడైంది. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు మందలించారు.దీంతో మనస్తాపానికి గురైన సుబ్బారావు గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రాజానగరం ఎస్ఐ నాగార్జున తెలిపారు.

నేడు కార్యదర్శులకు వర్క్‌షాప్

రాజమహేంద్రవరంరూరల్ నవంబరు 1: జిల్లావ్యాప్తంగా ఉన్న 300 పంచాయతీలలో ఉన్న కార్యదర్శులు, ఈవోపీఆర్డీలకు శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఆనం కళాకేంద్రంలో వర్క్‌షాప్ నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరవుతారని ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి నాగలత తెలిపారు. దీనిలో బాగంగా రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ పరిధిలో టీబీ రహిత గ్రామాలుగా ఎంపికైన 109 గ్రామ పంచాయతీ అధికారులకు టీబీ ముక్త్ అవార్డులు అందిచనున్నారు.

6 గంటలు..96 శాతం

7 గంటలు సర్వర్లు మొరాయించినా ఆగని పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సర్వర్లు మొరాయించినా పింఛన్ల పంపిణీ మాత్రం ఎక్కడా ఆగలేదు. రోజంతా కొనసాగుతూనే ఉంది. కేవలం ఆరు గంటల్లోనే ఏకంగా 2,28,995 మందికి పింఛన్లు అందించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శుక్రవారం ఏడుగంటల పాటు సర్వర్లు మొరాయించడంతో పింఛన్ల పంపిణీకి ఇబ్బంది ఏర్పడింది. పింఛనుదారులు, పంపిణీ చేసే అధికారులు ఒత్తిడికి గురయ్యారు. జిల్లాలో మొత్తం 2,38,196 పింఛనుదారులకు రూ.101 కోట్ల 62 లక్షల 95 వేల 500 పంపిణీ చేస్తారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల నుంచే జిల్లాలో సచివాలయ ఉద్యోగులు ,ఇతరులు పింఛన్ల పంపిణీ ఆరంభించారు. 7.30 గంటల వరకూ పంపిణీ బాగా సాగింది. అప్పటికే జిల్లాలో సుమారు 60 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. తర్వాత సర్వర్లు పనిచేయలేదు. అయితే సచివాలయ ఉద్యోగులు భోజనం కూడా చేయకుండా పింఛనదారుల ఇళ్ల వద్దనే ఉండిపోయారు. పింఛన్‌దారులు ఈరోజు ఇస్తారా లేదా అనే ఒత్తిడికి గురయ్యారు. చివరకు సాయంత్రం 3.30 గంటలకు సర్వర్లు పనిచేయడంతో పంపిణీ మొదలైంది. రాత్రి 7:30 గంటలకు 2,28,995 మందికి రూ.97 కోట్ల 69లక్షల 44 వేలు పంపిణీ చేశారు. కేవలం ఆరు గంటల్లో 96.26 శాతం. గత నెలలో 98 శాతం పైగా పంపిణీ చేయడం గమనార్హం. దేవరపల్లి మండలంలో బాగా తక్కువగా 94.3 శాతమే జరిగింది. కోరుకొండ మండలంలో అత్యధికంగా 97.46 శాతం జరిగింది. గత నెలలో రాష్ట్ర స్థాయిలో తొలిరోజు పింఛన్ల పంపిణీలో 3వ స్థానం లభించగా, ఈసారి 7వ స్థానానికి పడిపోయింది.



పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అత్తిలి కాలువ గట్టుకు గండి

నిడదవోలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నీటిపారుదల శాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగా కాలువకు గండి పడింది. అయితే రెవెన్యూ అధికారులు, రైతులు గండి పూడ్చడంతో పెద్ద ప్రమాదం తప్పింది. నిడదవోలు మండలం శెట్టిపేట శివారున అత్తిలి కాలువ గట్టు బలహీనపడిందని రైతులు నీటిపారుదల శాఖాధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చారు. ఇదిలా ఉండగా గురువారం అత్తిలి కాలువగట్టుకు గండి పడింది. దీంతో రైతులు రెవెన్యూ అధికారులు అప్రమత్తమై యుద్ధప్రాతిపదికన గండి పూడ్చడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అత్తిలి కాలువకు శెట్టిపేట, వేలివెన్ను మధ్య సుమారు 300 ఎకరాల ఆయకట్టు ఉంది. వరి పంట ఈనిక దశలో ఉండడంతో కాలువ నీరు పొలాలను ముంచితే పెద్ద ఎత్తున నష్టం జరిగేదని రైతాంగం ఆవేదన చెందారు. వేలివెన్ను ఉపసర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాస్, నాగరాజు నాయక్‌లు సత్వర చర్యలు చేపట్టి గండిని పూడ్చారు.





త్రుటిలో తప్పిన ప్రమాదం : అత్తిలి కాలువ గట్టుకు పడిన గండి.. పూడ్చుతున్న రైతులు

మాకెందుకీ కష్టం.. మంత్రివర్యా..!



నిడదవోలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మంత్రిగారి నియోజకవర్గంలో మహిళలు మండిపడ్డారు.. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం ప్రారంభోత్సవానికి మహిళలను తరలించాలని ఆదేశాలు అందాయి. అనుకున్నదే తడవుగా నాయకుల రంగంలోకి దిగారు. ఆ బాధ్యతను గ్యాస్ ఏజెన్సీలు తీసుకున్నాయి.. గతంలో అయితే మహిళలను ఆటోల్లో తరలించేవారు..దీంతో పెద్దగా ఇబ్బంది పడేవారు కాదు.. అయితే శుక్రవారం నిడదవోలు పట్టణంలోని రోటరీ ఆడిటోరియం వద్ద ఏర్పాటు చేసిన సభకు మహిళలను ఒక ఐషర్ వ్యాన్‌లో తీసుకొచ్చారు..ఆ వ్యాన్‌లో ఎలా దిగుతారు.. ఇదిగో ఇలా నిచ్చెన ఏర్పాటు చేసి దింపారు.. దీంతో మహిళలు చాలా ఇబ్బందిపడ్డారు.. ఒక మంత్రి పాల్గొనే సభకు ఇలా తీసుకొస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు..

అత్తింటి పేరుతో అంత్యక్రియలు వద్దు!

పెళ్లయిన 70 రోజులకే ఆత్మహత్య

నవ వధువు సూసైడ్ నోట్

వరకట్న వేధింపులే కారణం? 5

పచ్చని కడియంలో అమానుషం

వివాహిత గ్యాంగ్ రేప్

నలుగురు యువకుల అరెస్టు

గత నెల 15న ఘటన - మెయిన్‌లో

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

సామాజిక భద్రత కూటమి బాధ్యత

» మంత్రి కందుల దుర్గేష్
» కాల్దరిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం


కాల్దరిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి దుర్గేష్, బూరుగుపల్లి

ఉండ్రాజవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల సామాజిక భద్రతే కూటమి బాధ్యత అని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కాల్దరి గ్రామంలో ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పించన్ల పెంపుతో పేదలకు ప్రభుత్వం ఎంతో ఆర్థిక చేయూత అంది స్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు పేదలకు పెంచిన పింఛన్లను పంపిణీ చేస్తోందన్నారు. అనంతరం గ్రామంలో ధాన్యం కొను గోలు కేంద్రాన్ని మంత్రి దుర్గేష్, శేషారావు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ చీపుళ్ల కుమారి, నాయకులు కోమట్లల్లి వెంకటసుబ్బారావు, సింహాద్రి రామకృష్ణ, ఈర్పిన సత్యనారాయణ, ఎంపీడీవో వీఎస్ రామారావు, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పాల్గొన్నారు. మండలంలోని పాలంగి, కె.సావరం గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి, సోషల్‌వెల్ఫేర్ డీడీ ఎం.సందీప్ పరిశీలించారు.


చాగల్లులో పింఛన్లు అందజేస్తున్న హరిబాబు

చాగల్లులో 95 శాతం పూర్తి

చాగల్లు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పెన్షన్‌లు 95శాతం పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. చాగల్లులో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు సకాలలో సమర్థవంతంగా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాదెళ్ళ కరుటూరి సతీష్ పాల్గొన్నారు. నెలటూరులో సర్పంచ్ యడ్లపల్లి ఉమారజని, రకారావు, నందిగం శ్రీను, తాళ్లూరి ప్రసాద్ పింఛన్లు అందజేశారు. కార్యక్రమాలను ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు.

కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో
నైపుణాభివృద్ధి శిక్షణ కేంద్రం

ఆశ్రమాన్ని పరిశీలించిన జిల్లా ఇన్‌చార్జి దేవకీ దేవి


ఆశ్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి దేవకీ దేవి

సీతానగరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి విశ్వకర్మ నైపుణ్య అభివృద్ధి శిక్షణా కేంద్రం ఏర్పాటు విషయమై శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి దేవకీ దేవి, బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ కేంద్రంలో 25ఏళ్ల లోపు విద్యార్థులకు హాస్టల్ వసతితో పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు దేవి తెలిపారు. అయితే విద్యార్థినులతో పాటు విద్యార్థులు కూడా ఉంటారని, అందుకు ఆశ్రమం అనుమతి అవసరమన్నారు. అయితే ఇద్దరికీ వేరువేరు వసతితో పాటు హాస్టల్ సదుపాయం కూడా వేరుగా ఉండేలా ఏర్పాటు చేస్తామన్నారు. ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటామన్నారు. మొత్తం 40నుంచి 45 మంది ఉంటారని, వారిలో విద్యార్థినులు ఎక్కువగా ఉంటారని చెప్పారు. అయితే ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ అడపా మురళీకృష్ణ, బీజేపీ నాయకులు ఏపీఆర్ చౌదరి, నియోజకవర్గ ఇన్‌చారిజ నీరుకొండ వీరన్నచౌదరి, మండలాధ్యక్షుడు గూడపాటి జయరామ్, అధ్యక్షురాలు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేశానికి 'పటేల్' విశేష సేవలు

దివాన్‌చెరువు, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): భారతదేశ మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి విశేష సేవలందించారని ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో ఓఎన్‌జీసీ సహకారంతో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పటేల్ నాయకత్వ లక్షణాలను వివరించారు. వక్తృత్వం, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల కోఆర్డినేటర్లు ఎస్.రాజ్యలక్ష్మి, వి.పద్మావతి, ఎంవీఎస్ఎస్ నారాయణ, వై.సుష్మాప్రియ, బి.రాజశేఖర్, ఎల్.ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

రాతి బతుకులు

» రోళ్లు, రుబ్బురోళ్లకు తగ్గిన ఆదరణ
» గిట్టుబాటు కాని ధరలు
» అందని ప్రభుత్వ సాయం
» భారంగా జీవితాన్ని నెట్టుకొస్తున్న రంగరాయకాలనీ వాసులు

దేవరపల్లి, నవంబరు 1: బండరాళ్లతో గృహంలో వినియోగించే రోళ్లు, తిరగళ్లు ఎంతో నేర్పరితనంతో చేసే వారి జీవితాలు మారడం లేదు. దేవరపల్లి మండలం రంగరాయకాలనీకి చెందిన ఎన్నో కుటుంబాలు రాళ్ల పనులు చేసుకుంటూ జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. తాతముత్తాతల నుంచి బండ రాళ్లను మలిచి వివిధ వస్తువులను తయారు చేస్తున్న వీళ్ల జీవితం మారలేదు. అన్ని కులాల, వృత్తుల వారికి గత ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టి వారికి సొమ్ములు వేసి ఆర్థికంగా ఆదుకున్నారని తమ వృత్తి వారికి ఎటువంటి సహకారం అందలేదని వాపో తున్నారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6వరకు పని చేస్తున్నా తాము తయారు చేసే వస్తువులకు రోజుకు రూ.300 కూలి కూడా గిట్టడం లేదన్నారు. ప్రస్తుతం తయారు చేస్తున్న పలు రకాల వస్తువులకు ఆదరణ లేకుండా పోయిందని మిక్సీలు, గ్రైండర్లు వచ్చాకా రోళ్లు, రుబ్బురోళ్లు, వంటివి అమ్మకాలు జరగడం లేదని వాపోయారు. ఈ రోళ్లు, రుబ్బురోళ్లు తయారు చేయడం ఒక ఎత్తైతే అమ్మకాలు చేయడం మరో ఎత్తని, ఊరూర తిరిగి అమ్ముతున్నామని, గిట్టుబాటు ఉండడంలేదన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం మమ్మల్ని అన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.




రాళ్లను రోళ్లుగా చెక్కుతున్న కార్మికులు

గిరాకీ తగ్గింది

మేము తయారు చేసుకున్న రాతి వస్తువులకు గిరాకీ తగ్గింది. ఊరూరా తిరిగి అమ్ముతున్నా మిక్సీలు, గ్రైండర్లు వచ్చాక ఆదరణ తగ్గి అమ్మకాలకు కష్టంగా ఉంది.

-షేక్ మస్తాన్‌బీ, రంగరాయ కాలనీ

చేతి మూడువేళ్లు కోల్పోయా..

రోళ్లు, రుబ్బురోళ్లు తయారు చేసే సమయంలో నా చేతి మూడువేళ్లు కోల్పోయాను. దివ్యాంగ పించన్ కోసం గత ప్రభుత్వంలో నమోదు చేసుకున్నప్పటికీ పించన్ రాలేదు. మాకు ఏ విధమైె ప్రయోజనం కలగలేదు. కొత్త ప్రభుత్వంలోనైనా మా బతుకులు మారతాయని ఆశిస్తున్నాం.

-షేక్ ఖలీషా, రంగరాయ కాలనీ.

రూ.300 కూడా గిట్టడం లేదు

రాతి వస్తువుల తయారీ వల్ల కూలి కనీసం రూ.300 కూడా గిట్టడంలేదు. ప్రతి రోజు సుత్తి, శానంతో రాతిని వస్తువులుగా మలిచేటప్పుడు మా రెక్కగూళ్లు అరిగిపోతున్నాయి. వృత్తిదారులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలి.

-షేక్ సులేమాన్,రంగరాయ కాలనీ.

నరసన్న సన్నిధిలో నిత్యాన్నదానం

కోరుకొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో 30రోజుల పాటు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఆలయం వద్ద మాట్లాడుతూ నరసింహస్వామి కొండపైన, దిగువన తాగునీరు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఇందిరాగాంధీ వర్ధంతి


దేవరపల్లిలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దేవరపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): భారతదేశం అన్ని విధాల అభివృద్ధికి ఇందిరాగాంధీ ఎంతో కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెలగా రామకృష్ణ అన్నారు. దేవరపల్లిలో ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక మూడు బొమ్మల సెంటర్ వద్ద ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు. ఇందిరాగాంధీ భూసంస్కరణలను, బ్యాంకుల జాతీయకరణ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టి భారతీయుల హృదయాల్లో సుస్థిరస్థానం ఏర్పాటు చేసుకుందని అన్నారు. పేదలకు ఇళ్లపట్టాలు ఇచ్చి ఇళ్లు కూడా నిర్మించారన్నారు. కార్యక్రమంలో పీసీసీ కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు కాకర్ల శ్రీహరిబాబు, గుత్తికొండ సూరిబాబు, తాతా చిన్నబ్బాయి, తదితరుల పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

నిడదవోలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం అట్లపాడు గ్రామానికి చెందిన ఎం.నాగు (38) కుటుంబ కలహాల నేపథ్యంలో గత నెల 5వ తేదీన కలుపు మందు తాగాడు. చికిత్స పొంది ఇంటికి వచ్చిన అనంతరం మళ్లీ సుస్తి చేయడంతో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్టు సమిశ్రగూడెం ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వేడుకగా దీపావళి

చాగల్లు, నవంబరు 01 (ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళి పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో వేడుకగా జరుపుకున్నారు. ప్రతి ఇంట్లోను మహిళలు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇంటి ముంగిళ్లను దీపాలతో అలంకరించారు. చిన్నారులు టపాసులు పేల్చి సందడి చేశారు. కాగా దీపావళి మందుగుండు సామగ్రి ధరలు ఎక్కువగా ఉండడం వల్ల సాంప్రదాయం కోసం కొద్ది మొత్తంలోనే మందులు కొనుగోలు చేసినట్టు చెబుతున్నారు. ధరాఘాతం వల్ల పేదలు ఇంట్లో టపాసులు పేలలేదని పలువురు అభిప్రాయపడ్డారు. మండలంలో ఎటువంటి ప్రమాదాలు జరక్కుండా ఆనంద వాతావరణంలో జరగడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

4న టీటీడీ గోదావరి హారతి

కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే,ఆర్‌డీవో


కొవ్వూరులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆర్‌డీవో సుస్మిత

కొవ్వూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గోష్పాదక్షేత్ర పటిష్టతను ప్రతి ఒక్కరూ కాపాడాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం టీటీడీ ఆధ్వర్యంలో నవంబరు 4వ తేదీన గోష్పాదక్షేత్రంలో నిర్వహించనున్న గోదావరి హారతి ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. అనంతరం కార్తీకమాసం పురస్కరించుకుని గోష్పాక్షేత్రంలో పర్యటించి స్నానఘట్టాలను, పారిశుద్య నిర్వహణను పరిశీలించారు. క్షేత్రంలో ఆలయాల నిర్వాహకులతో సమావేశమై సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గోష్పాదక్షేత్ర పటిష్టతను ప్రతి ఒక్కరూ కాపాడాలన్నారు. జీవనది గోదావరి కలుషితం కాకుండా కృషిచేయాలన్నారు. క్షేత్రంలో బహిరంగ మల,మూత్ర విసర్జనను నిషేధించాలని, టాయిలెట్స్‌ను వినియోగించాలన్నారు. క్షేత్రంలో ఆవులను వదిలివేయడంతో అపారిశుధ్యం నెలకొంటుందని గురుస్వామి నున్న సాయి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. క్షేత్రంలో ఆలయాల నుంచి వచ్చే నీరు బయటకు పోవడానికి ఓపెన్ డ్రైనేజీని ఏర్పాటు చేయాలని శివాలయం అర్చకుడు మానేపల్లి శ్రీనివాసరావు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో రోహిణికుమార్, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, కౌన్సిలర్ మురళీకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, కమిషనర్ నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు నియామయాల్లో
ఆర్యవైశ్యులపై చిన్నచూపు

దివాన్‌చెరువు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన టీటీడీ బోర్డు నియామకంలో ఆర్యవైశ్యులను చిన్న చూపు చూడడం తగదని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బలబద్ర సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చాక తమ సంఘీయులను కూరలో కరివేపాకులా తీసిపారవేసి కించపరచడం సమంజసంకాదన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి

పెరవలి: అజ్జరం గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెంబర్ 1లో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు కందికుప్ప కాశీ విశ్వనాథం మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు దీక్ష, ప్రాణ త్యాగంతో 1953 నవంబరు 1న ఆంధ్ర రాష్ట్ర అవతరించిందన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

దీపం పంపిణీలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలెండర్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆర్థిక లోటు ఉన్నా ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం శివరామ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీస్ కార్యాలయం వద్ద దీపం-2 పథకాన్ని ఎమ్మెల్యేతో పాటు ఆర్డీవో రాణి సుస్మిత ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదటి గ్యాస్ సిలెండర్‌ను మార్చి 31లోపు పొందవచ్చన్నారు. తెల్లరేషన్ కార్డుదారులు ఆధార్, గ్యాస్, బ్యాంకు ఖాతాకు ఒకే ఫోన్ నంబరును లింక్ చేసుకుని కెవైసీ చేసుకోవాలన్నారు. గ్యాస్‌బుక్ చేసుకున్న 48 గం టల్లో వారి బ్యాంకు ఖాతాలో సిలెండర్‌కు చెల్లించిన ధర జమవు తుందన్నారు. టిడ్కో గృహాలను త్వరితగతిన లబ్ధిదారులకు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత గ్యాస్ పంపిణీ

తాళ్లపూడి: ఎన్నికల హామీల్లో మహిళలకు ఇచ్చిన ఉచిత గ్యాస్ పంపిణీని అమలు చేశామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత గ్యాస్ పంపిణీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ప్రక్కిలంక గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌దారుల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు జీవీ ప్రసాదు, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, తహశీల్దార్ బి.రవీంద్రనాథ్, ఎంపీడీవో వెంకటరమణ, సీఎస్‌డీటీ దివాకర్, ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు తదితర కూటమి నాయకులు ఎల్గొన్నారు.

అధికారులపై ఎమ్మెల్యే సీరియస్: రాష్ట్ర వ్యాప్తంగా దీపం పథకం పంపిణీని అట్టహాసంగా నిర్వహిస్తుంటే తాళ్లపూడిలో కనీసం లబ్ధిదారులను దీనికి హాజరు చేయించకపోవడంపై రెవెన్యూ, మండల అధికారులపై ఎమ్మెల్యే మండిపడ్డారు. నాయకులు తప్ప లబ్ధిదారులెవరూ కనపడక పోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొట్లాట కేసులో ఇద్దరిపై కేసు నమోదు

కొవ్వూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొట్లాట కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. కొవ్వూరు మండలం ఆరికిరేవుల కొత్తపేటలో ఉంటున్న ముప్పిడి సూర్యారావు ఇంటి బయట గతనెల 31న రాత్రి సమయంలో అన్నదమ్ములు పసలపూడి నరేంద్ర, దుర్గ ఘర్షణ పడుతున్నారు. దీంతో సూర్యారావు తల్లి పల్లమ్మ ఇంటి నుంచి వచ్చి ఎందుకు ఘర్షణ పడుతున్నారని ప్రశ్నించడంతో వారిద్దరు ఆమెను దూషించడంతో వెళ్లిపోయింది. ఇది తెలుసుకున్న ఆమె కుమారుడు పసలపూడి సూర్యారావు శుక్రవారం తన తల్లిని ఎందుకు దూషించారని ప్రశ్నించాడు. దీంతో వారిద్దరు సూర్యారావును అతని సోదరుడు దాసును చేతులు, రాళ్ళతో కొట్టి గాయపర్చారు. గాయపడిన ఇద్దరిని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పసలపూడి నరేంద్ర, దుర్గలపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ కె.జగన్మోహనరావు తెలిపారు.

తారాజువ్వ పడి.. డ్రిప్ సామగ్రి దహనం


దహనం అవుతున్న లారీలోని సామగ్రి

గోపాలపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా బాణసంచా కాలుస్తున్న సమయంలో తారాజువ్వ పడిన ఘటనలో లారీలోనున్న పామాయిల్ డ్రిప్ సామగ్రి బూడిదైంది. వేలచింతలగూడెం సొసైటీ వద్ద ఆగి ఉన్న లారీలో ఉన్న రూ.3 లక్షల విలువైన పామాయిల్ డ్రిప్ సామగ్రి కాలిపోయింది. స్థానికులు కొవ్వూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటీన చేరుకుని అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు.

కెరియర్ గైడెన్స్‌పై మోటివేషన్

గోపాలపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ గురుకుల ఆశ్రం పాఠశాల, రాజంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ మోటివేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మానవత విద్యా కమిటీ విద్యానిధి చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మానవత సభ్యులు పాల్గొన్నారు.

పెన్షన్ పంపిణీలో మొరాయించిన సర్వర్లు


ఫింఛన్లు పంపిణీ చేస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత, ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 13 వార్డులో ఫించన్ల పంపిణీని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆర్డీవో రాణి సుస్మిత శుక్రవారం ప్రారంభించారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు సాంకేతిక సమస్యలు తలెత్తడంతో సర్వర్ పనిచేయక మొదటి రోజు ఫించన్ల పంపిణీ ఆలస్యమైంది. పట్టణంలో 91.08 శాతం పంపిణీ చేసినట్టు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. మండలంలోని 16 గ్రామాల్లో మొదటి రోజు 92.05 శాతం ఫించన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, మద్దిపట్ల శివరామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: పెన్షన్ల పంపిణీలో సర్వర్లు మొరాయించడంతో పలుచోట్ల అసంపూర్తిగా జరిగింది. కొంతమందికి పెన్షన్లు అందగా, మరి కొంత మందికి అందకపోవడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురయ్యారు. తాళ్లపూడి ఎంపీడీవో వెంకటరమణ వివరణ ఇస్తూ ఉదయం 9 గంటలకే 65 శాతం లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ పూర్తి చేశామన్నారు. మిగిలిన లబ్ధిదారులకు సర్వర్లు పనిచేయగానే పంపిణీ చేస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థినుల ఎంపిక


ఎంపికైన బాలికలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నిడదవోలు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా పోటీలకు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన కారింకి జ్యోతి, టెక్కుటి దీపిక ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చెరుకూరి పద్మ, వ్యాయామ ఉపాధ్యాయిని శాంతి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా యోగా పోటీల్లో వారిద్దరు ప్రతిభ కనబరిచారని తెలిపారు. నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వారిద్దరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులను అభినందించారు.

కార్నియాల సేకరణ

తాళ్లపూడి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పెద్దేవం గ్రామానికి చెందిన జమ్ముల గోపాలం మృతి చెందగా అతని కార్నియాలను నిడదవోలు రాజరాజేశ్వరి లెన్స్ నేత్రాలయ వైద్య సిబ్బంది సేకరించారు. హైదరాబాదులోని ఎల్‌వి ప్రసాదు ఐ ఇన్‌స్టిట్యూట్‌కి పంపించారని మండల లైన్స్‌క్లబ్ ప్రతినిధి మద్దుకూరి శ్రీనివాస్ తెలిపారు. కుటుంబ సభ్యులు వెంకట్రాయుడు, ధనలక్ష్మి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ వ్యవస్థాపక వేడుకలు

నిడదవోలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని ఏఐటీయూసి కార్యదర్శి మాముడూరి నాగేంద్ర వర ప్రసాదరావు అన్నారు. గురువారం పట్టణంలో ఏఐటీయూసి 105 వ్యవస్థాపక వేడుకలు జరిపారు. ఆయన మాట్లాడుతూ నాలుగు కార్మిక కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ముందుగా ఏఐటీయూసి పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎం.శ్రీను, రామిశెట్టి సత్తిబాబు, కోసూరి శ్రీనివాస్, మామిడి సన్యాసిరావు, రొంగల శ్రీనివాస్, పరదేశీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్క్రీన్1	: వేట్టయన్
వై.స్క్రీన్2	: విశ్వం
దేవిశ్రీ(గాయత్రి	: మార్టిన్
అనన్య	: దేవర
నిడదవోలు	
వీ మ్యాక్స్	: లక్కీ భాస్కర్
రాధాకృష్ణ	: వెనం
శ్రీగణపతి	: అమరన్
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	: దేవర
త్రినాథ్ సినీ మ్యాక్స్	: దేవర


బాలికల ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన ఆశ్రితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

గోపాలపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా హిందూపురంలో గతనెల 25, 26, 27 తేదీల్లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ - 14 బాలికల ఫుట్‌బాల్ పోటీలకు వాదాలకుంట గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు నలుగురు క్రీడాకారిణిలు పాల్గొన్నట్టు ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచిన పీ.ఆశ్రిత జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు.

పాలంగిలో ఘనంగా మహాయాగం

ఉండ్రాజవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంగి గ్రామంలో అష్టవాజపేయ మహాయాగం శుక్రవారం ప్రారంభించారు. నెలమూరుకు చెందిన ఉమారామలింగేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో యాగ నిర్వాహకులు జంధ్యాల శ్రీనివాససుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా కుంకుమ పూజలు, దీపోత్సవం, పాశుపత రుద్రాభిషేకాలు, చండీ హోమాలు జరిపారు. తణుకు ఎమ్మెల్యే ఆరుమిల్లి రాధాకృష్ణ పూజల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు శర్మ మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 15 వరకు జరుగుతాయన్నారు.

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం

నిడదవోలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి అమరుడైన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.మేరీ సుజాత అన్నారు. శుక్రవారం నిడదవోలులోని కళాశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డి.హరీష్, గ్రంథాలయ అధికారి జి.రామ్ మోహన్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.ఏసురత్నం, బాలకృష్ణ, సురేష్ కుమార్, కుమారస్వామి, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

కొవ్వూరు: బాషా ప్రయుక్త రాష్ట్రాల సాధనలో తెలుగువాడికి ప్రత్యేక గుర్తింపు తేవడంలో పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మట్టే వీవీ వరప్రసాద్ అన్నారు. పట్టణంలో శుక్రవారం రాష్ట్రావతరణ దినోత్సవాన్ని జరిపారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మట్టే ప్రసాద్ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కొల్లేపర శ్రీనివాస్, తుమ్మలపల్లి రమేష్, ఎంబీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: మెయిన్ రోడ్డులో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద రాష్ట్రావతరణ దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొంతా శ్యాం రవిప్రకాష్ మాట్లాడారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలన్న యత్నాలను కూటమి ప్రభుత్వం అడ్డుకొనకపోవడం శోచనీయమన్నారు. అమరులైన పొట్టి శ్రీరాములు, టి.అమృతరావులతో పాటు 32 మంది ప్రాణ త్యాగాలను వృథా కానీయమన్నారు. లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో కన్నెం మురళి, నేతల ప్రసాద్, దొడ్డి వెంకటేశ్వర్లు, మాముడూరి బంగార్రాజు, కొయ్య వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


నిడదవోలులో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధ్యాపక బృందం